

ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:122 | ఎడిటర్: మేనం శ్యామ్ | సోమవారం 23-11-2026 | పేజీలు: 13

సిరా చుక్క

కరీంనగర్ గడ్డపై
కదం తొక్కి కదిలిరా..
కాషాయ దండుకు తోడుగా
జతకట్టి నడిచిరా!
నిజాన్ని దాచే
దుష్ప్రచారపు చీకట్లను చీల్చడానికి,
అరాచకపు శక్తుల
ఆటకట్టించి అణచడానికి..
బండి సంజయ్ అన్న సైన్యంలో
భాగమై నిలవరా!
నితిన్ నబిన్ గారితో అడుగులో
అడుగు వేసి, లక్షలాది
జనసందోహంతో చరిత్రను తిరగరాసి..
మహా పాదయాత్రలో
పాలుపంచుకుని ముందుకు సాగిపో!
వేములవాడ రాజన్న
ఆశీస్సులు అండగా,
కొండగట్టు అంజన్న దీవెనలు
కొండంత బలంగా..
కరీంనగర్ మహాశక్తి అమ్మవారి
దీవెనలతో..
బండి సంజయ్ అన్న
దృఢ సంకల్పంతో సాగే
ఈ మహా యాత్రలో,
ఈరోజు ఉదయం 12 గంటలకు
ప్రతి ఒక్కరూ కదిలిరండి..
ఈ చారిత్రాత్మక ఘట్టంలో
భాగస్వాములు కండి!..

ముచ్చుకూర్
సుమన్ గౌడ్

ఏపీ ప్రాజెక్టులకు కేసీఆరే కారణం

- 299 టీఎంసీలకు ఆయనే సంతకం చేశారు: సీఎం రేవంత్
- కేసీఆర్ హయాంలోనే ఏపీలో ప్రాజెక్టుల పనులు ప్రారంభమయ్యాయని వ్యాఖ్య
- 299 టీఎంసీలకు కేసీఆర్ సంతకం చేశారని ఆరోపణ
- పల్నాడు వాటర్ గ్రిడ్ పథకం 2022లోనే మొదలైందని వెల్లడి
- పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు కూడా గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమైందని వ్యాఖ్య
- తాము అధికారంలోకి వచ్చాక ఏపీలో ఒక్క ప్రాజెక్టు కూడా చేపట్టలేదని స్పష్టీకరణ





ప్రజా వాయిస్, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో చేపడుతున్న ప్రాజెక్టులకు మాజీ సీఎం కేసీఆర్ హయాంలో తీసుకున్న నిర్ణయాలే కారణమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 299 టీఎంసీలకు కేసీఆర్ సంతకం చేశారని, దాని ఆధారంగానే ఏపీలో ప్రాజెక్టులు చేపట్టారని విమర్శించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణకు కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు నిధులు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు.2022లో కేసీఆర్, అప్పటి ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే పల్నాడు వాటర్ గ్రిడ్ పథకం ప్రారంభమైందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ పథకానికి సంబంధించి రూ.1,580 కోట్లతో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ కింద 2022లోనే ఉత్తర్వులు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వాల నిర్ణయాల వల్లే ప్రస్తుతం ఈ ప్రాజెక్టు వ్యవహారం తెరపైకి వచ్చిందని వ్యాఖ్యానించారు.

పోతిరెడ్డిపాడు కూడా గత ప్రభుత్వ హయాంలోనే..

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ప్రారంభమైందని, ఆ సమయంలో టీఆర్ఎస్ నేతలు మంత్రివర్గంలో ఉన్నారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలపై ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం సరికాదని విమర్శించారు.తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క ప్రాజెక్టు కూడా చేపట్టలేదని సీఎం స్పష్టం చేశారు. ఏపీ ప్రాజెక్టుల విషయంలో తమ ప్రభుత్వంపై వస్తున్న విమర్శలకు గత ప్రభుత్వ నిర్ణయాలే సమాధానమని వ్యాఖ్యానించారు. నాగార్జున సాగర్ నుంచి నీటిని తరలించే టన్నెల్ ప్రాజెక్టుపై తెలంగాణలో రాజకీయ విమర్శలు కొనసాగుతున్న వేళ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

రేవంత్ దమ్ముంటే మహిళలను లక్షాధికారులను చేయాలి

- లేదంటే రాజకీయాల నుంచి తప్పుకుంటా: కేటీఆర్
- కాంగ్రెస్ 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందంటూ విమర్శలు
- మహిళలను లక్షాధికారులుగా చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్
- వరంగల్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆరోపణ
- కేసీఆర్ హయాంలోనే వరంగల్‌కు ఐటీ కంపెనీలు వచ్చాయని వ్యాఖ్య
- 500 రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది
- 2028లో కేసీఆర్ సీఎం అవుతారని ధీమా



ప్రజా వాయిస్, వరంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీ హైకమాండ్‌కు గులాంలుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే మహిళలను కోటీశ్వరులను చేయడం దేవుడెరుగని.. కనీసం లక్షాధికారులుగా చేసి చూపించాలని సవాల్ విసిరారు. మహిళలను లక్షాధికారులను చేస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఛాలెంజ్ చేశారు. ఆదివారం వరంగల్ నగరంలో నిర్వహించిన బీఆర్ఎస్ జనచైతన్య బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగించారు.కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని, 420 హామీలు ఇచ్చిన రేవంత్ సర్కార్ వాటిని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రికి చేతులు రావడం లేదా అని నిలదీశారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ అబద్దాలు చెప్పలేదని, కరోనా సమయంలోనూ బీఆర్ఎస్ పాలనలో సంక్షేమ కార్యక్రమాలు ఆగలేదని పేర్కొన్నారు.

వరంగల్ అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారు

వరంగల్‌లో దేశంలోనే అతిపెద్ద ఆసుపత్రిని మాజీ సీఎం కేసీఆర్ నిర్మించారని, అయినా రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు ఎందుకు ప్రారంభించలేదని కేటీఆర్ ప్రశ్నించారు. వరంగల్‌లో ఐటీ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం చేసిందని ఆరోపించారు. నగర అభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలోనే వరంగల్‌కు ఐటీ కంపెనీలు వచ్చాయని గుర్తుచేశారు.వరంగల్‌ను ఫ్యూచర్ సిటీగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేసిన కేటీఆర్.. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ఫ్యూచర్ లేదని, వరంగల్లే అసలైన ఫ్యూచర్ సిటీ అని వ్యాఖ్యానించారు. కాళోజీ కళాక్షేత్రంలో కార్యాలయం ఏర్పాటు చేస్తామని చెప్పి, బీఆర్ఎస్

మిగతా 2లో

మహా పాదయాత్రను అడ్డుకుంటే గట్టిగా సమాధానం చెబుతాం: బండి సంజయ్

- కరీంనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర
- యాత్రలో పాల్గొననున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్
- బీజేపీని ఎదుర్కొనే దమ్ము కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు లేదని వ్యాఖ్య
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని రేవంత్ వ్యాఖ్యలతో అర్థమవుతోందని విమర్శ
- తెలంగాణలో త్వరలోనే డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తుందని ధీమా

2 లో



జనసేన నేతల పేరుతో ఉద్యోగాల మోసం

- హైదరాబాద్ లో సీఐడీ సోదాలు!
- దేవాదాయ, పోలీస్ శాఖల్లో ఉద్యోగాలిప్పిస్తామని నిరుద్యోగులకు వల
- ఒక్కొక్కరి నుంచి రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు
- కూకట్ పల్లిలో న్యాయవాది కార్యాలయంలో ఏపీ సీఐడీ తనిఖీలు
- నకిలీ గుర్తింపు కార్డులు, నియామక పత్రాలు గుర్తింపు
- కేసులో ఏ2 నిందితుడు పెద్దిరాజుకు 14 రోజుల రిమాండ్

2 లో





ఆర్టీసీకి ఐ-అలర్ట్ టెక్నాలజీతో రూ.36 కోట్ల ఆదా!

- 1,500 బీఎస్-6 బస్సుల్లో ఐ-అలర్ట్ వ్యవస్థ ఏర్పాటు
- నెలకు 1.98 లక్షల లీటర్ల డీజిల్ పొదుపు
- ప్రతి నెలా రూ.2 కోట్ల వరకు ఇంధన వ్యయం తగ్గింపు
- డ్రైవర్ల వేగం, గేర్లు, బ్రేకింగ్ విధానంపై నిరంతర పర్యవేక్షణ
- నెలకు 507 మెట్రిక్ టన్నులకుపైగా కార్బన్ ఉద్గారాల తగ్గింపు
- ఏపీ, కర్ణాటక ఆర్టీసీల ఆసక్తి

ప్రజా వాయిస్, హైదరాబాద్: ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీగా ఇంధనాన్ని ఆదా చేస్తోంది. బస్సు డ్రైవర్ల డ్రైవింగ్ తీరును పర్యవేక్షించే 'ఐ-అలర్ట్' (i-ALERT) టెక్నాలజీతో ఇప్పటివరకు సుమారు రూ.36 కోట్ల డీజిల్ ఖర్చును ఆదా చేసినట్లు సంస్థ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం 1,500 అశోక్ లేలాండ్ బీఎస్-6 బస్సుల్లో ఈ వ్యవస్థను అమలు చేస్తున్నారు. దీని ద్వారా ప్రతి నెలా సుమారు 1,98,090 లీటర్ల డీజిల్ ఆదా అవుతుండగా, దాదాపు రూ.2 కోట్ల ఇంధన వ్యయం తగ్గుతోంది.

ఇంతకీ ఐ-అలర్ట్ టెక్నాలజీ అంటే ఏమిటి?

డీజిల్ వినియోగాన్ని తగ్గించడంతోపాటు డ్రైవర్ల డ్రైవింగ్ సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు రూపొందించిన పర్యవేక్షణ వ్యవస్థే ఐ-అలర్ట్. బస్సు నడుస్తున్న సమయంలో డ్రైవర్ గేర్ ఎంపిక, వేగం, ఇంజిన్ ఆర్‌పీఎం,

మిగతా 2లో

నాగోల్‌లో జ్యువెల్లరీ షాపులో చోరీ యత్నం

- గోడకు కన్నం వేసిన దొంగలు!
- ఆనంద్‌నగర్ ఎక్స్ రోడ్డులో అర్ధరాత్రి ఘటన
- అశాపుర పాన్ బ్రోకర్ అండ్ జ్యువెల్లర్స్‌లోకి వెనుక గోడకు రంధ్రం చేసి ప్రవేశం
- ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తుల చోరీ యత్నం
- ఎలాంటి వస్తువులు అపహరణకు గురికాకపోవడంతో తప్పిన భారీ నష్టం
- నాలుగు వేలిముద్రలు సేకరించిన క్లూస్ టీమ్
- సీసీటీవీ ఆధారంగా పోలీసుల దర్యాప్తు





తాగునీటి కోసం ఏపీకి 9 టీఎంసీలు

- నేడు కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ కీలక భేటీ!
- శ్రీశైలం, నాగార్జునసాగర్ నీటి నిల్వలపై సమీక్ష
- తాగునీటి అవసరాల కోసం 9 టీఎంసీలు కోరిన ఏపీ
- పల్నాడు, గుంటూరు, బాపట్ల సహా పలు జిల్లాలకు 8 టీఎంసీలు
- సాగర్ కుడి, ఎడమ కాలువల పరిధిలోని ప్రాంతాలకు మరో టీఎంసీ
- మూడు నెలల పాటు దశల వారీగా నీటి విడుదలకు ప్రతిపాదన

ప్రజా వాయిస్, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో ప్రస్తుతం ఎంతమేర నీటి నిల్వలు ఉన్నాయి? వాటిని ఇరు రాష్ట్రాల తాగునీటి అవసరాలకు ఎంతకాలం వరకు సర్దుబాటు చేయవచ్చు? అనే అంశాలపై కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) దృష్టి సారించనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాగునీటి అవసరాల కోసం మొత్తం 9 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఈ నెల 18న బోర్డుకు విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లోని కేఆర్ఎంబీ ప్రధాన కార్యాలయంలో త్రిసభ్య కమిటీ సమావేశం జరగనుంది.బోర్డు మెంబర్ సెక్రటరీ నేతృత్వంలో జరిగే ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్

మిగతా 2లో

ఆర్టీసీకి ఐ-అలర్ట్ టెక్నాలజీతో రూ.36 కోట్ల ఆదా!

బ్రేకింగ్ విధానం వంటి అంశాలను ఈ టెక్నాలజీ విశ్లేషిస్తుంది. నిర్దేశించిన గ్రీన్ బ్యాండ్ ఆర్‌పీఎం పరిధిలో బస్సు నడుపుతున్నారా? ఎకానమీ గేర్లను సరిగ్గా ఉపయోగిస్తున్నారా? అవసరం లేకున్నా ఇంజిన్‌ను ఆన్‌లో ఉంచుతున్నారా? అతివేగంగా ప్రయాణిస్తున్నారా? వంటి అంశాలను గుర్తిస్తుంది.

డ్రైవర్ల పనితీరుకు గ్రేడింగ్

డ్రైవర్ విధి ముగిసిన తర్వాత ఐ-అలర్ట్ వ్యవస్థ రూపొందించిన నివేదిక ఆధారంగా అతడి పనితీరును విశ్లేషిస్తారు. డ్రైవింగ్ సామర్థ్యాన్ని బట్టి గ్రేడ్లు కేటాయిస్తారు. లోపాలను గుర్తించి అవసరమైన సూచనలు, శిక్షణ అందిస్తారు. శాస్త్రీయమైన డ్రైవింగ్ పద్ధతులను పాటించేలా ప్రోత్సహిస్తారు. దీనివల్ల అనవసరమైన ఇంధన వినియోగం తగ్గడమే కాకుండా ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణం అందించే అవకాశం ఉంటుంది.

పర్యావరణానికి మేలు..

డీజిల్ వినియోగం తగ్గడంతో కార్బన్ డయాక్సైడ్ (CO_2) ఉద్గారాలు కూడా తగ్గుతున్నాయని టీజీఎస్ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ విధానం ద్వారా ప్రతి నెలా సుమారు 507.11 మెట్రిక్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గిస్తున్నట్లు వెల్లడించారు. ఏడాదికి ఈ తగ్గింపు 6,169.84 మెట్రిక్ టన్నులుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇలా ఒకవైపు సంస్థకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుండగా, మరోవైపు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతోంది.



ఏపీ, కర్ణాటక ఆర్టీసీల ఆసక్తి

టీజీఎస్ఆర్టీసీ అమలు చేస్తున్న ఐ-అలర్ట్ టెక్నాలజీపై పొరుగు రాష్ట్రాల రవాణా సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఈ వ్యవస్థ పనితీరు, ఫలితాల గురించి తెలుసుకునేందుకు ఏపీఎస్ఆర్టీసీ, కేఎస్ఆర్టీసీ అధికారులు తెలంగాణ ఆర్టీసీ అధికారులను సంప్రదించినట్లు సంస్థ వెల్లడించింది.ఈ టెక్నాలజీని విజయవంతంగా అమలు చేస్తున్న ఇంజినీరింగ్ విభాగాన్ని టీజీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కుమార్ అభినందించారు. ప్రయాణికులకు మరింత సురక్షితమైన, సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు సంస్థలో ఆధునిక సాంకేతికతను నిరంతరం అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఇతర విభాగాలు కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సంస్థ పనితీరు, సేవల నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు.

పార్టీకి నష్టం చేసే వ్యాఖ్యలు వద్దు

- మరోసారి పునరావృతమైతే చర్యలు: సీఎం రేవంత్‌రెడ్డి
- నేతలకు ఏమైనా సమస్యలుంటే ఇన్‌చార్జికి ఫిర్యాదు చేయాలని సూచన
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి అంశంపై పీఏసీలో చర్చ
- ఈ ఒక్కసారికి వదిలేద్దామని నేతలకు సీఎం సూచన
- మళ్లీ ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక
- తెలంగాణలో కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యమని స్పష్టీకరణ



ప్రజా వాయిస్, హైదరాబాద్: పార్టీకి నష్టం కలిగించేలా బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని ముఖ్యమంత్రి, టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో రేవంత్‌రెడ్డి నేతలకు సూచించారు. పార్టీలో ఏమైనా ఇబ్బందులు ఉంటే పార్టీ ఇన్‌చార్జికి ఫిర్యాదు చేయాలని, తన వల్ల లేదా మంత్రుల వల్ల సమస్యలు ఎదురైనా ఆయన దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. ఆదివారం గాంధీ భవన్‌లో జరిగిన పీఏసీ సమావేశంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు.ఇన్‌చార్జికి ఫిర్యాదు చేస్తే తమతో తప్పకుండా చర్చిస్తారని రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్టీకి నష్టం చేసే వ్యాఖ్యల వల్ల మంచి అంశాలు చర్చకు రాకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల వరకు సందీప్ తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా కొనసాగుతారని వెల్లడించారు.

రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి అంశంపై చర్చ

పీఏసీ సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యవహారం చర్చకు వచ్చినట్లు సమాచారం. వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు నేతలు కోరగా, ఈ ఒక్కసారికి వదిలేద్దామని సీఎం సూచించినట్లు తెలిసింది. మరోసారి పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించేలా మాట్లాడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం.ఈ సందర్భంగా మంచి విషయాలను మైకులో చెప్పాలని, చెడు విషయాలను చెవిలో చెప్పాలని రేవంత్‌రెడ్డి సూచించారు. అధిష్ఠానం ఆదేశాలను పదశాతం పాటిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల కోసం మరోసారి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని, రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు.

నాగోల్‌లో జ్యువెల్లరీ షాపులో చోరీ యత్నం

ప్రజా వాయిస్, హైదరాబాద్:నాగోల్‌లో దొంగలు జ్యువెల్లరీ షాపులో చోరీకి విఫలయత్నం చేశారు. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆనంద్‌నగర్ ఎక్స్ రోడ్డులో శనివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఆశాపుర పాన్ బ్రోకర్ అండ్ జ్యువెల్లర్స్ దుకాణంలోకి ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు వెనుక గోడకు రంధ్రం చేసి ప్రవేశించారు. అయితే ఎలాంటి వస్తువులు అపహరణకు గురికాకపోవడంతో భారీ నష్టం తప్పింది.అర్ధరాత్రి సమయంలో దుకాణం వెనుక గోడకు కన్నం వేసిన దొంగలు లోపలికి ప్రవేశించి చోరీకి ప్రయత్నించారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు షాపులోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. చోరీ యత్నం విషయం ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో షాపు యజమాని పోలీసులను ఆశ్రయించాడు.

నాలుగు వేలిముద్రలు సేకరణ

బాధితుడి ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ ఏసీపీ రవీందర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆధారాల సేకరణ కోసం క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించారు. ఈ క్రమంలో నిందితులకు సంబంధించిన నాలుగు వేలిముద్రలను సేకరించినట్లు సమాచారం.సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు నిందితుల గుర్తింపు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ముగ్గురు దొంగలు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారు? గతంలో ఇలాంటి ఘటనలకు పాల్పడ్డారా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

మహా పాదయాత్రను అడ్డుకుంటే గట్టిగా సమాధానం చెబుతాం: బండి సంజయ్

ప్రజా వాయిస్, కరీంనగర్: కరీంనగర్ జిల్లాలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా పాదయాత్రను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే గట్టిగా సమాధానం చెబుతామని కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. ఈ యాత్రలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు.బీజేపీ అంటేనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భయమని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. బీజేపీని ఎదుర్కొనే దమ్ము కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు లేదన్నారు. కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ ఎలా ప్రత్యర్థి అవుతుందో రేవంత్‌రెడ్డి స్పష్టం చేయాలని ప్రశ్నించారు. ఫామ్‌హౌస్‌లో ఉంటున్న కేసీఆర్.. రేవంత్‌రెడ్డికి ప్రత్యర్థా? అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనన్న విషయం సీఎం వ్యాఖ్యలతో అర్థమవుతోందని విమర్శించారు.

తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తుంది

తెలంగాణలో త్వరలోనే బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో జరగనున్న మహా పాదయాత్రను అడ్డుకోవాలని ఎవరైనా ప్రయత్నిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. అలాగే, 'ఎస్ఐఆర్' ప్రక్రియను ఎదుర్కొనేవారంతా దేశద్రోహులంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి.

తాగునీటి కోసం ఏపీకి 9 టీఎంసీలు

జలవనరుల శాఖ, తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు హాజరుకానున్నారు. ఇరు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, జలాశయాల్లో నీటి లభ్యత, నిల్వల పరిస్థితిపై చర్చించనున్నారు.

ఏపీకి 9 టీఎంసీలు అవసరం

పల్నాడు, గుంటూరు, బాపట్ల, మార్కాపురం, ప్రకాశం జిల్లాల తాగునీటి అవసరాల కోసం 8 టీఎంసీల నీరు అవసరమని ఏపీ ప్రభుత్వం బోర్డుకు నివేదించింది. నాగార్జునసాగర్ కుడి కాలువ పరిధిలోని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలతో పాటు ఎడమ కాలువ పరిధిలోని ఏలూరు జిల్లా తాగునీటి అవసరాల కోసం మరో టీఎంసీ కేటాయించాలని కోరింది.ఈ నెల 25 నుంచి మూడు నెలల పాటు దశలవారీగా నీటిని విడుదల చేయాలని ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ ప్రతిపాదించారు. వేసవి ప్రారంభానికి ముందే తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఈ విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది.ఏపీకి 9 టీఎంసీలు అవసరంపల్నాడు, గుంటూరు, బాపట్ల, మార్కాపురం, ప్రకాశం జిల్లాల తాగునీటి అవసరాల కోసం 8 టీఎంసీల నీరు అవసరమని ఏపీ ప్రభుత్వం బోర్డుకు నివేదించింది. నాగార్జునసాగర్ కుడి కాలువ పరిధిలోని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలతో పాటు ఎడమ కాలువ పరిధిలోని ఏలూరు జిల్లా తాగునీటి అవసరాల కోసం మరో టీఎంసీ కేటాయించాలని కోరింది.ఈ నెల 25 నుంచి మూడు నెలల పాటు దశలవారీగా నీటిని విడుదల చేయాలని ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ ప్రతిపాదించారు. వేసవి ప్రారంభానికి ముందే తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఈ విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది.

గత సమావేశాల్లో కొలిక్కిరాని సమస్య

గత ఆగస్టు 13న జలాశయాల్లో నీటి నిల్వలపై చర్చించేందుకు త్రిసభ్య కమిటీ సమావేశమైనప్పటికీ స్పష్టమైన నిర్ణయం తీసుకోలేకపోయింది. ఆ సమావేశంలో ఇరు రాష్ట్రాలు 2027 ఆగస్టు వరకు నీటి వినియోగానికి సంబంధించిన ఇండెంట్‌ను సమర్పించాయి. అనంతరం మరో రెండుసార్లు సమావేశాలు నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదు.అన్ని అంశాలను పూర్తిస్థాయి బోర్డు సమావేశంలో చర్చించాలని నిర్ణయించినప్పటికీ, ఆ భేటీ పలుమార్లు వాయిదా పడింది. ఉమ్మడి ప్రాజెక్టుల్లోని నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని కేఆర్ఎంబీ ఇప్పటికే ఇరు రాష్ట్రాలకు సూచించింది.ఈ నేపథ్యంలో తాగునీటికి ప్రాధాన్యత ఇస్తూనే, రాబోయే వేసవిలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నీటి పంపిణీపై సమన్వయంతో నిర్ణయం తీసుకోవడం కీలకంగా మారింది. తాజా త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏపీ విజ్ఞప్తిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

జనసేన నేతల పేరుతో ఉద్యోగాల మోసం

ప్రజా వాయిస్, హైదరాబాద్: జనసేన నేతల పేర్లు చెప్పి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ లక్షల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ధరణి కృష్ణ కేసులో ఏపీ సీఐడీ దర్యాప్తు ముమ్మరం చేసింది. ధరణి కృష్ణ హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో సీఐడీ అధికారులు నగరంలో సోదాలు నిర్వహించారు. కూకట్‌పల్లిలోని ఓ న్యాయవాది కార్యాలయంలో తనిఖీలు చేపట్టగా, నకిలీ గుర్తింపు కార్డులు, నియామక పత్రాలు గుర్తించినట్లు సమాచారం.దేవాదాయ, పోలీస్ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మించి ఈ మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో బాధితుడి నుంచి రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో బోడపాటి ధరణి కృష్ణ, నిమ్మకాయల పెద్దిరాజు తదితరులపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.

ఏ2 నిందితుడికి 14 రోజుల రిమాండ్

ఈ కేసులో ఏ2గా ఉన్న నిమ్మకాయల పెద్దిరాజును సీఐడీ అధికారులు నవంబర్ 18న అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐడీ అదనపు డీఎస్పీ బి. సీతారామయ్య విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం పెద్దిరాజును గుంటూరులోని సీఐడీ కోర్టులో హాజరుపరచగా, మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో అతడిని గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.ధరణి కృష్ణ కోసం సీఐడీ అధికారులు గాలింపు కొనసాగిస్తుండగా, హైదరాబాద్‌లో నిర్వహించిన సోదాల్లో లభించిన నకిలీ గుర్తింపు కార్డులు, నియామక పత్రాల ఆధారంగా దర్యాప్తును మరింత విస్తరించే అవకాశం ఉంది. ఉద్యోగాల పేరుతో డబ్బులు చెల్లించిన బాధితులు ఇంకా ఎవరైనా ఉన్నారా? ఈ మోసం వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణాల్లో అధికారులు విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది.

రేవంత్ దమ్ముంటే మహిళలను లక్షాధికారులను చేయాలి

మొదటి పేజీ తరువాయి

సభ ఉందని తెలియగానే నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్ నేతలే అవినీతిని బయటపెడుతున్నారు

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి తమ ప్రభుత్వంలో అవినీతి ఉందని చెబుతున్నారని కేటీఆర్ ప్రస్తావించారు. మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సైతం ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబాలకు చెందిన వారి కోసం ఇంటర్నేషనల్ కళాశాలలను తొలగిస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి అభివృద్ధి చేస్తానంటే తాను అడ్డొచ్చానా? అని ప్రశ్నించారు.

500 రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి..

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని కేటీఆర్ అన్నారు. మరో 500 రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని, 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో వరంగల్‌తో తనకు, పార్టీకి ఎంతో అనుబంధం ఉందని, నగరంలో బీఆర్ఎస్ నిర్వహించిన సభలన్నీ విజయవంతమయ్యాయని తెలిపారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అమిత్ షాకు వత్తాసు పలకడం తప్ప తెలంగాణ గురించి ఏమైనా ఆలోచిస్తున్నారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఢిల్లీకి మోకరిల్లుతున్నారని విమర్శించారు. ప్రజలకు ఆమోదయోగ్యం కాని ఆలోచనలతో రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. మోసపోతే గోస పడతాం అని కేసీఆర్ ఆనాడే చెప్పారని, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను గుర్తిస్తున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

ఉగ్రవాదుల పేరుతో ఈ-మెయిల్ కలకలం

- హైదరాబాద్ లో రాత్రంతా పోలీసుల తనిఖీలు!
- నగరంలో దాడులు చేస్తామంటూ లష్కరే తోయిబా పేరుతో బెదిరింపు మెయిల్
- పోలీసుల విచారణలో ఫేక్ మెయిల్ గా గుర్తింపు
- శనివారం రాత్రి 9:03 గంటలకు హైదరాబాద్ సీపీ, స్పెషల్ బ్రాంచ్ కు మెయిల్
- అప్రమత్తమైన స్పెషల్ బ్రాంచ్.. అన్ని పోలీస్ స్టేషన్లకు హెచ్చరికలు
- నగరంలోని పలు ప్రాంతాల్లో రాత్రంతా విస్తృత తనిఖీలు



ప్రజా వాయిస్, హైదరాబాద్: నగరంలో దాడులకు పాల్పడుతామంటూ ఉగ్రవాదుల పేరుతో వచ్చిన ఈ-మెయిల్ కలకలం రేపింది. లష్కరే తోయిబా పేరుతో వచ్చిన బెదిరింపు మెయిల్‌పై పోలీసులు అప్రమత్తమయ్యారు. అయితే ప్రాథమిక విచారణలో ఈ మెయిల్ నకిలీదిగా గుర్తించినట్లు సమాచారం.శనివారం రాత్రి 9:03 గంటలకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ (సీపీ), స్పెషల్ బ్రాంచ్‌ను ఉద్దేశించి ఈ బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో వెంటనే అప్రమత్తమైన స్పెషల్ బ్రాంచ్ అధికారులు నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలకు హెచ్చరికలు జారీ చేశారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలని, భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

నగరవ్యాప్తంగా విస్తృత తనిఖీలు

బెదిరింపు మెయిల్ నేపథ్యంలో పోలీసులు నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, ప్రాంతాలపై నిఘా పెంచారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసు బృందాలు శనివారం రాత్రంతా తనిఖీలు కొనసాగించాయి. నకిలీ మెయిల్‌గా గుర్తించినప్పటికీ, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు.

పంచాయతీ పక్కనపెట్టి..ఫార్మ్‌హౌస్‌లో సెటిల్‌మెంట్లు!

- మహిళా సర్పంచులుంటే భర్తలదే పెత్తనం..
- తెరవెనుక కార్యదర్శుల హవా!
- ఏళ్ల తరబడి మొయినాబాద్ మండలాన్ని వీడని పలువురు కార్యదర్శులు..
- అక్రమ నిర్మాణాల వసూళ్లలో కింగ్ మేకర్లుగా మారుతున్నారంటు గ్రామాల్లో చర్చ!
- 111 జీవో సమాధి అయినా మాకేంటి.. మామూళ్లు అందితే చాలంటున్న ఉన్నతాధికారులు !
- మొయినాబాద్ లో అసలేం జరుగుతోంది?

కలెక్టర్ ప్రత్యేక నిఘా పెట్టాలంటున్న ప్రజలు



మొయినాబాద్ (ప్రజావాయిస్):గ్రామ పంచాయతీ కార్యదర్శి అంటే ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి. గ్రామంలో పారిశుద్ధ్యం నుంచి పన్నుల వసూళ్ల వరకు.. అభివృద్ధి పనుల నుంచి పంచాయతీ రికార్డుల నిర్వహణ వరకు ఎన్నో బాధ్యతలు ఆయనపై ఉంటాయి. కానీ మొయినాబాద్ మండలంలోని కొందరు పంచాయతీ కార్యదర్శుల వ్యవహారశైలిపై ఇప్పుడు అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.పంచాయతీ రికార్డుల నిర్వహణ నుంచి నిర్మాణాల అనుమతులు, పన్నుల వసూళ్ల వరకు బాధ్యతలు నిర్వహించాల్సిన చోట.. కొందరు కార్యదర్శుల వ్యవహారశైలిపై ఇప్పుడు అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ విధులు నిర్వహించాల్సిన వారు తెరవెనుక వ్యవహారాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అక్రమ నిర్మాణాల వ్యవహారాల్లో కొందరి పాత్రపై గ్రామాల్లో చర్చ జోరుగా నడుస్తోంది.అలాగే మహిళా సర్పంచుల స్థానంలో వారి భర్తలే పెత్తనం చెలాయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏళ్ల తరబడి మండలంలోనే మకాం .. ఇంతటి అనుబంధం ఎందుకు?

మొయినాబాద్ మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో పలువురు కార్యదర్శులు ఏళ్ల తరబడి కొనసాగుతున్నారనే చర్చ ఉంది. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు పరిపాలనలో సహజమైన ప్రక్రియ. అయితే ఒకే మండలంలో సుదీర్ఘకాలం పనిచేస్తున్న వారి విషయంలో బదిలీ విధానం ఎలా అమలవుతోంది? వారి పోస్టింగ్ వివరాలేమిటి? బదిలీ ఎందుకు కావడం లేదు? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. ఒకే చోట దీర్ఘకాలిక కొనసాగింపు వల్ల స్థానికంగా ఏర్పడే పరిచయాలు, ప్రభావాలు, ప్రయోజనాలపై ఉన్నతాధికారులు సమీక్ష చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాల వసూళ్లలో 'కింగ్ మేకర్లు'గా కార్యదర్శులు

మొయినాబాద్ మండలంలో అనుమతులు లేని నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధమైన కట్టడాలపై ప్రజల నుంచి తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి. అయినా కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు ఆగకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారాల్లో కొందరు పంచాయతీ కార్యదర్శులు వసూళ్లకు మధ్యవర్తులుగా, కింగ్ మేకర్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు గ్రామాల్లో గట్టిగానే వినిపిస్తున్నాయి. నిర్మాణదారులకు అనుకూలంగా వ్యవహరించి, తెరవెనుక లావాదేవీలకు మార్గం సుగమం చేస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.

పంచాయతీ కార్యాలయం దాటి.. ఫార్మ్ హౌస్ లో సెటిల్మెంట్లు?

ఈ వ్యవహారాల్లో ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శికి సంబంధించిన ఆరోపణ ఇప్పుడు ప్రత్యేకంగా చర్చకు వస్తోంది. అక్రమ నిర్మాణదారుడిని పంచాయతీ కార్యాలయానికి కాకుండా ఏకంగా ఫార్మ్‌హౌస్‌కు పిలిపించుకుని మాట్లాడినట్లు ప్రచారం జరుగుతోంది.అక్కడ "ఏమున్నా అడిగింది ఇచ్చుకో.. అక్రమంగా నిర్మాణం కొనసాగించుకో" అన్నట్లుగా భరోసా ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాల్సిన అధికారే ఏకంగా అక్రమ నిర్మాణదారుడికి హుకుం జారిచేసి చట్టానికి సమాధి కడుతున్నట్లు గుసగుసలు గుప్పుమంటున్నాయి.

కార్యదర్శుల పనితీరుపై కలెక్టర్ ప్రత్యేక సమీక్ష అవసరం

మొయినాబాద్ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శుల పోస్టింగ్‌లు, బదిలీలు, పదవీకాలం, విధుల నిర్వహణపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా నిర్మాణాల అనుమతులు, పంచాయతీ ఆదాయ-వ్యయాలు, ఫిర్యాదుల రిజిస్టర్లు, అక్రమ నిర్మాణాలపై తీసుకున్న చర్యలు, 111 జీవో పరిధిలోని నిబంధనల అమలును పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



రోడ్ల విస్తరణ అయ్యేది ఎప్పుడు

- ప్రధాన రహదారిపై రోడ్డు విస్తరణ లేక బస్సు డ్రైవర్లకు తప్పని ఇబ్బందులు
- కల్వరాల–చీపనగండ్ల రహదారిపై ఇరుకైన మార్గంతో వాహనాల రాక పోకలకు అవస్థలు

ప్రజా వాయిస్.. వీపనగండ్ల వీపనగండ్ల కల్వరాల ప్రధాన రహదారిపై రోడ్డు విస్తరణ లేకపోవడంతో బస్సు డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రహదారి ఇరుకుగా ఉండటంతో ఎదురెదురుగా బస్సులు వచ్చినప్పుడు క్రాసింగ్ చేసుకోవడానికి డ్రైవర్లు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బస్సులను పక్కకు తప్పించి ముందుకు వెళ్లేందుకు తగినంత స్థలం లేకపోవడంతో ప్రయాణికులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రోడ్డు విస్తరణ చేపట్టకపోవడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని బస్సు డ్రైవర్లు పేర్కొంటున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన రహదారిని విస్తరించి, బస్సులు, ఇతర వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.ఆగస్టు 24 తారీఖున మంత్రి జూపల్లి కృష్ణారావు కల్వరాల కేతపల్లి వరకు డబల్ రోడ్డు మంజూరు అయింది అని టెంకాయ కూడా కొట్టినాడు. కానీ ఇంతవరకు ఆ పనులు చేపట్టలేదు అని స్థానికులు విమర్శిస్తున్నారు. ఎన్నో సంవత్సరాల నుండి ఈ రోడ్డు పనులు అవుతాయా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా డబల్ రోడ్డు పనులు చేపట్టాలని రహదారులను విస్తరణ చేసి రాకపోకలకు ఆటంకం లేకుండా చేయాలని గ్రామస్తులు మండల ప్రజలు కోరుతున్నారు.



ఊకొండిలో ప్రమాద ఘంటికలు.!

- ఇండ్ల మధ్యలో రక్షణలేని పాడుబడిన బావి
- నిత్యం రాకపోకలు సాగించే ప్రజలకు పొంచి ఉన్న ముప్పు
- రాత్రివేళల్లో ప్రమాదం జరిగే అవకాశం ఉందంటున్న గ్రామస్తులు
- అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం
- తక్షణ రక్షణ చర్యలకు డిమాండ్

ప్రజా వాయిస్, మునుగోడు:మునుగోడు మండలం ఊకొండి గ్రామంలో పాత ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో ఉన్న పాడుబడిన బావి ప్రమాదకరంగా మారింది. జనావాసాల మధ్యలోనే బావి ఉండటంతో అటుగా రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. బావి చుట్టూ కనీస రక్షణ కంచె లేకపోవడంతో ఏ సమయంలోనైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ మార్గంలో నిత్యం ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. రహదారిపై మూలమలుపు ఉండటంతో రాత్రివేళల్లో బావి కనిపించకపోతే వాహనదారులు ప్రమాదానికి గురయ్యే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పాదచారులు, స్థానికులు ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే భయపడుతున్నారు.ఇంతటి ప్రమాదకర పరిస్థితి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పందించకపోవడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి బావి చుట్టూ తాత్కాలిక రక్షణ కంచె, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

పేదల ఇళ్లపై అమెజాన్ కన్ను..!

- బడినీ వదలరా.. గుడినీ కూల్చేస్తారా.?
- పెద్దవేడులో అమెజాన్ సంస్థ కూల్చివేత యత్నంపై గ్రామస్తుల ఆగ్రహం
- 23 ఏళ్లుగా నివాసముంటున్న పేదల ఇళ్లకు ముప్పు.
- ప్రభుత్వ పాఠశాలకూ ప్రమాదం
- ముందస్తు నోటీసులేవీ లేకుండా ఎలా కూల్చివేస్తారని సర్పంచ్ చక్కటి రాజ సులోచన రెడ్డి నిలదీత
- ఎమ్మార్వో అనుమతులున్నాయంటూ పంచాయతీని పట్టించుకోవడం లేదని ఆరోపణలు







ప్రజా వాయిస్ ,షాబాద్:పేదల ఇళ్లపై అమెజాన్ సంస్థ కన్నుపడిందా, పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలను సైతం కూల్చివేయాలనుకుంటోందా, ముందస్తు నోటీసులు, సమాచారం లేకుండానే కూల్చివేతలకు ఎలా ప్రయత్నిస్తారని పెద్దవేడు గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం పెద్దవేడు గ్రామంలోని సర్వే నంబర్ 147 పరిధిలో ఈ వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, రామాలయం, క్రీడా ప్రాంగణం, చెట్ల నర్సరీతో పాటు పక్కనే ఉన్న పేదల ఇళ్లను కూల్చివేసేందుకు అమెజాన్ సంస్థ ప్రతినిధులు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత 23 ఏళ్లుగా అక్కడే నివసిస్తున్న కావలి పద్మమ్మ, గౌండ్ల యాదయ్య తమ ఇళ్లను కూల్చివేస్తే తమకు దిక్కెవరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ అనుమతి అక్కర్లేదా.?

కూల్చివేతల ప్రయత్నాన్ని గ్రామ సర్పంచ్ చక్కటి రాజ సులోచన రెడ్డి, గ్రామస్తులు అడ్డుకుని సంస్థ ప్రతినిధులను నిలదీశారు. తమకు ఎమ్మార్వో అనుమతి ఉందని, అందుకే పనులు చేపడుతున్నామని వారు చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎమ్మార్వో అనుమతుల పేరుతో గ్రామ పంచాయతీని పూర్తిగా విస్మరించడం ఏమిటని సర్పంచ్ ప్రశ్నించారు. గతంలో కేటాయించిన భూముల పరిధిలోనే ప్రహరీ నిర్మించాల్సి ఉండగా.. ప్రస్తుతం హద్దులు దాటి పంచాయతీ పరిధిలోని భూములను సైతం స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పేదల గోడు పట్టదా.?

రెక్కాడితే కానీ డొక్కాడని కూలీలమని, జీవితకాలం కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టి నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేస్తే తమ బతుకులు రోడ్డున పడతాయని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. తమ పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలను కూడా కూల్చివేయాలనుకోవడం దారుణమన్నారు. తమకు న్యాయం చేయకపోతే ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకుంటామని బాధితులు హెచ్చరించడం కలకలం రేపుతోంది.

కూల్చివేతలు నిలిపివేయాలిఉన్నతాధికారులు తక్షణమే స్పందించి భూవివాదంపై సమగ్ర విచారణ జరిపించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. భూముల హద్దులు, అనుమతులను పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. విచారణ పూర్తయ్యే వరకు కూల్చివేతలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని, లేదంటే ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

కూల్చివేతలు నిలిపివేయాలి

ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి భూవివాదంపై సమగ్ర విచారణ జరిపించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. భూముల హద్దులు, అనుమతులను పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. విచారణ పూర్తయ్యే వరకు కూల్చివేతలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని, లేదంటే ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

యువతకు ఆదర్శంగా ఏసీపీ మడత రమేష్

- గోదావరిఖని నుంచి కాళేశ్వరం వరకు 72.50 కిలోమీటర్ల సైకిల్ యాత్ర
- 3 గంటల 58 నిమిషాల్లో యాత్ర పూర్తి.
- ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారి



ప్రజా వాయిస్ రామగుండంపోలీసు విధుల ఒత్తిడిని అధిగమిస్తూ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్న రామగుండం ఏసీపీ మడత రమేష్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. సైక్లింగ్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో ఆదివారం గోదావరిఖని నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం వరకు సుదీర్ఘ సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ సైకిల్ యాత్రలో భాగంగా ఏసీపీ మడత రమేష్ మొత్తం 72.50 కిలోమీటర్ల దూరాన్ని 3 గంటల 58 నిమిషాల 44 సెకన్లలో పూర్తి చేశారు. గంటకు సగటున 18.2 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించి కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

విధుల మధ్య ఫిట్ నెస్ కు ప్రాధాన్యత

పోలీసు విధుల్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ సమయం దొరికినప్పుడల్లా సైక్లింగ్‌కు కేటాయించడం ఆయనకు అలవాటు. గతంలోనూ గోదావరిఖని నుంచి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు వరకు సైక్లింగ్ చేస్తూ తన ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలికి సందేశం

ప్రస్తుత కాలంలో యువత వ్యాయామం పట్ల నిర్లక్ష్యం చేయకుండా నిత్యజీవితంలో సైక్లింగ్, నడక వంటి శారీరక వ్యాయామాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. సైక్లింగ్‌తో శారీరక దృఢత్వం పెరగడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుంది. తన సైకిల్ యాత్రల ద్వారా ఏసీపీ మడత రమేష్ యువతకు ఆరోగ్యంపై మంచి సందేశాన్ని అందిస్తున్నారు.



డిజిటల్ సంతకాలతో నకిలీ ధ్రువపత్రాలు

- బెల్లంపల్లిలో 27 మరణ ధ్రువీకరణ పత్రాల అక్రమ జారీ
- ఐదుగురు అరెస్టు.. మరొకరి కోసం గాలింపు
- ఒక్కో పత్రానికి రూ.2 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు

ప్రజావాయిస్,బెల్లంపల్లి : ప్రభుత్వ అధికారుల డిజిటల్ సంతకాలను దుర్వినియోగం చేసి నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని బుద్ధఖుర్ద్, పెర్కపల్లి గ్రామాల పరిధిలో 27 అక్రమ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఒక్కో పత్రానికి రూ.2 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఐదుగురి అరెస్టు

ఈ కేసులో ఎంపీఓ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ చిందం శ్రీనివాస్, బుద్ధఖుర్ద్ కారోబార్ చిందం రవి, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆనంద్, సాగర్, గోదావరిఖనికి చెందిన మీ సేవ ఆపరేటర్ నరేందర్‌లను పోలీసులు అరెస్టు చేశారు. మంచిర్యాలకు చెందిన మరో నిందితుడు వైకుంఠం పరారీలో ఉన్నట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ తెలిపారు

సంతకాల దుర్వినియోగం

ప్రభుత్వ అధికారుల డిజిటల్ సంతకాలను అక్రమంగా వినియోగించి ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు విచారణలో గుర్తించారు. ఈ వ్యవహారంలో మరెవరి ప్రమేయమైనా ఉందా? ఇంకా ఎన్ని అక్రమ పత్రాలు జారీ అయ్యాయి? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేలకొండపల్లి బౌద్ధ స్థూపం వద్ద జీపీఆర్ సర్వే షురూ!

- మంత్రి పొంగులేటి చొరవ, ప్రొఫెసర్ షిండే సూచనలతో కీలక అడుగు!
- పురావస్తు శాఖ, ఎన్.జి.ఆర్.ఐ ఆధ్వర్యంలో భూగర్భ పరిశీలన
- నివేదిక ఆధారంగా లక్ష్యిత తవ్వకాలు
- పురాతన కట్టడాలకు నష్టం కలగకుండా చరిత్ర వెలికితీత
- హెరిటేజ్ అధికారి అర్జున్ రావు వెల్లడి



ప్రజా వాయిస్ ఖమ్మం: కాలగర్భంలో కలిసిపోయిన ఒక మహోన్నత సామ్రాజ్యపు ఆనవాళ్లను తిరిగి సజీవంగా ప్రపంచం ముందుకు తెచ్చే చారిత్రక ఘట్టానికి ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కేంద్రం వేదికైంది. శతాబ్దాల నాటి బౌద్ధ స్థూపం, రోమన్ సామ్రాజ్యంతో వాణిజ్య సంబంధాలు నెరిపిన ఈ నేల గర్భంలోని రహస్యాలను ఛేదించేందుకు శనివారం పురావస్తు శాఖ (హెరిటేజ్ డిపార్ట్‌మెంట్), హైదరాబాద్‌లోని నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తల బృందం కలిసి సర్వేను నేలకొండపల్లి సర్పంచ్ తో కలిసి ప్రారంభించారు.పాలేరు శాసన సభ్యులు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవతో.. గత నెలలో దేశ ప్రఖ్యాత ఆర్కియాలజీ శాస్త్రవేత్త ప్రొఫెసర్ వసంత్ ఎస్. షిండే నేలకొండపల్లిలో పర్యటించడం ఈ ప్రాంత చరిత్రకు సరికొత్త మలుపుగా మారింది. ప్రొఫెసర్ షిండే సూచనల మేరకు ఎంజీఆర్ఐ డైరెక్టర్, హెరిటేజ్ అధికారులు అర్జున్ రావు, డిడి నాగరాజు ఆధ్వర్యంలో జియాలజీ డివిజన్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ సకారం గుగ్లోతు బృందం బౌద్ధ స్థూపం లేయర్లను గుర్తించే ప్రక్రియను ముమ్మరం చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యాధునిక గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ పరికరంలోని 200 మెగాహెర్ట్జ్, 400 మెగాహెర్ట్జ్ యాంటెనాల సాయంతో.. బౌద్ధ స్థూపం, బైరాగి గుట్ట పరిసర ప్రాంతాల్లో 5 మీటర్ల నుంచి 10 మీటర్ల లోతు వరకు దాగి ఉన్న చారిత్రక నిర్మాణాల లోతు, దూరం వివరాలను శాస్త్రవేత్తలు అత్యంత కచ్చితత్వంతో సేకరిస్తున్నారు. ఈ సర్వే నివేదికను పురావస్తు శాఖకు అందజేసిన అనంతరం, పక్కా ఆధారాలు ఉన్న ప్రాంతాల్లో మాత్రమే శాస్త్రీయ పద్ధతిలో తవ్వకాలు చేపట్టనున్నారు. తద్వారా శతాబ్దాల నాటి నేలకొండపల్లి ఘన చరిత్ర ఏమాత్రం చెక్కుచెదరకుండా, సజీవ సాక్ష్యంగా భావితరాలకు అందనుంది. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ శీలం వెంకట లక్ష్మి, ఆర్కియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ గంగా దేవి,మల్లు నాయక్, ఖమ్మం జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, డ్రాఫ్ట్ మెన్ శంకర్, సైట్ సూపర్వైజర్ అశ్విన్ కుమార్, గ్రీన్వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ అధ్యక్షులు దుద్దేల రవి కుమార్, వార్డు మెంబర్ లింగం యలమంద, గ్రామ పంచాయతీ సిబ్బంది జ్వాలా సాయి, పగిడికత్తుల గోపి, పురావస్తు సిబ్బంది స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.



తవ్వి వదిలేసిన సీసీ రోడ్డు.. కాలనీవాసుల అవస్థలు

- ఎల్ ఐజీ కాలనీలో పది రోజులుగా నిలిచిన రోడ్డు పనులు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- జీహెచ్ ఎంసీ అధికారుల తీరుపై మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి అసహనం
- డిప్యూటీ ఇంజినీర్ కు ఫోన్ .. పనులు వెంటనే పూర్తి చేయాలని సూచన

ప్రజా వాయిస్,పటాన్‌చెరు: రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి మధ్యలోనే నిలిపివేయడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారతీనగర్ డివిజన్‌లోని ఎల్ఐజీ కాలనీలో సీసీ రోడ్డు పునరుద్ధరణ పనులు పది రోజులుగా అసంపూర్తిగా ఉండిపోయాయి. రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానికులు, సొసైటీ సభ్యుల ఫిర్యాదు మేరకు మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ఆదివారం కాలనీవాసులతో కలిసి రోడ్డు పనులను పరిశీలించారు. పలుమార్లు జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ సిబ్బందికి తెలియజేసినా స్పందన లేకపోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు డిప్యూటీ ఇంజినీర్ వెంకట రమణకు ఫోన్ చేసి నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో
2026 సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై తీవ్ర ఆరోపణలు!

- రక్తసంబంధీకురాలు నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థిని పరీక్ష రాస్తుంటే ఇన్విజిలేషన్ ఎలా చేశారు?
- నారాయణ కళాశాలతో రహస్య ఒప్పందం జరిగిందా?
- ఇన్విజిలేషన్ లో నిబంధనల ఉల్లంఘనకు సహకరించారా?
- రెండు నెలల జాప్యం తర్వాత కదిలిన ఇంటర్మీడియట్ బోర్డు విచారణ.. ప్రిన్సిపాల్ పాత్రపై తేలని ప్రశ్నలు!
- బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ సూర్యవంశం కంప్లైంట్ తో కదులుతున్న డొంక.

ప్రజా వాయిస్ మిర్యాలగూడ : వివరాల్లోకి వెళితే..నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026 మే నెలలో నిర్వహించిన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై తీవ్ర ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. పరీక్షల నిర్వహణలో నిబంధనల ఉల్లంఘన జరిగిందా? ఇన్విజిలేషన్ బాధ్యతల్లో అక్రమాలకు పాల్పడ్డారా? ప్రైవేటు నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం కల్పించారా? ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ పాత్ర ఏమిటి? ఇలా అనేక ప్రశ్నలు ఇప్పుడు విద్యాశాఖను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ సూర్యవంశం పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం తెరపైకి వచ్చింది. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించాల్సిన అధికారులు రెండు నెలలకు పైగా కాలయాపన చేయడంపై విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాయి.

రక్తసంబంధీకురాలు పరీక్ష రాస్తుంటే ఇన్విజిలేషన్ ఎలా చేశారు?

ఫిర్యాదులో ప్రధానంగా ప్రస్తావించిన అంశం లెక్చరర్ గొల్ల స్వామి వ్యవహారం. ఇంటర్మీడియట్ పరీక్షల నిబంధనల ప్రకారం ఇన్విజిలేటర్‌కు రక్తసంబంధీకులు అదే పరీక్షా కేంద్రంలో పరీక్ష రాస్తున్నట్లయితే సంబంధిత అధికారులకు ముందస్తు సమాచారం అందించి ఆ ఇన్విజిలేషన్ విధుల నుంచి తప్పుకోవాల్సి ఉంటుందని నగేష్ సూర్యవంశం పేర్కొంటున్నారు.అయితే గొల్ల స్వామి తన రక్తసంబంధీకురాలు నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థిని (విద్యార్థి పేరు బయటికి రావడం భావ్యం కాదు కాబట్టి పేరు మెన్షన్ చేయలేదు) మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాస్తున్న సమయంలో ఇన్విజిలేషన్ విధులు నిర్వహించారని ఫిర్యాదులో ఆరోపించారు. ఇదే నిజమైతే పరీక్షల నిర్వహణలో ప్రయోజనాల సంఘర్షణ తలెత్తినట్లేనని, ఈ అంశంపై నామినల్ రోల్స్, ఇన్విజిలేషన్ డ్యూటీ రికార్డులు పరిశీలించి అధికారులు స్పష్టత ఇవ్వాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

నారాయణ జూనియర్ కళాశాలతో రహస్య ఒప్పందం జరిగిందా?

ఈ వ్యవహారంలో మరో సంచలన ఆరోపణ ప్రైవేటు నారాయణ జూనియర్ కళాశాలకు సంబంధించినది. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్ సహకారంతో నారాయణ జూనియర్ కళాశాల యాజమాన్యానికి, పరీక్షల విధుల్లో ఉన్న సిబ్బందికి మధ్య రహస్య అవగాహన ఏర్పడిందని, తద్వారా నారాయణ కళాశాల విద్యార్థులకు మాల్‌ప్రాక్టీస్‌కు సహకరించారనే అనుమానాలను నగేష్ సూర్యవంశం తన ఫిర్యాదులో వ్యక్తం చేశారు.అయితే ఈ ఆరోపణలపై ఇప్పటివరకు అధికారికంగా నిర్ధారణ వెలువడలేదు. సీసీ కెమెరాల ఫుటేజీ, పరీక్షా కేంద్రంలోని ప్రవేశ రికార్డులు, విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలను పరిశీలిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

విచారణకు ముందు రోజు లెక్చరర్లతో సమావేశం ఎందుకు?

విచారణ ప్రారంభానికి ముందు రోజు ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్ కళాశాల లెక్చరర్లందరితో సమావేశం నిర్వహించడంపై కూడా ఫిర్యాదుదారుడు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విచారణలో వెల్లడించాల్సిన అంశాలపై ముందస్తు ప్రభావం చూపే ప్రయత్నం జరిగిందా? సాక్ష్యాలను ప్రభావితం చేసే చర్యలు ఏమైనా జరిగాయా? అన్న కోణంలోనూ పరిశీలన జరగాలని డిమాండ్ చేస్తున్నారు.విచారణను అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నాలు చేశారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్రంగా ఆధారాలను సేకరించి నిర్ధారించాల్సిన బాధ్యత విచారణ అధికారులపై ఉంది.



రెండు నెలల తర్వాత స్పందించిన ఇంటర్మీడియట్ బోర్డు!

పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ విచారణ ప్రారంభించేందుకు అధికారులు రెండు నెలలకు పైగా సమయం తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలుమార్లు ఫిర్యాదులు, విజ్ఞప్తులు చేసిన తర్వాతే అధికారులు కదిలారని నగేష్ సూర్యవంశం ఆరోపిస్తున్నారు.ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి అభినవ్ అభిలాష అందుబాటులోకి రాకపోవడంపై కూడా ఫిర్యాదుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జయప్రద భాయ్ ఏమన్నారంటే?

ఈ వ్యవహారంపై స్పందించిన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జయప్రద భాయ్ విచారణ జరిగిందని, పూర్తి సమాచారం తమ వద్దకు చేరడానికి కొంత సమయం పడుతుందని వెల్లడించినట్లు తెలిపారు.కిందిస్థాయి అధికారులు విచారణకు అవసరమైన సహకారం అందించడం లేదని, ఎవరైనా తప్పుడు నివేదికలు సమర్పించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు.తప్పు చేసిన ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని, అయితే చర్యలు తీసుకునే అధికారం ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శికి ఉంటుందని ఆమె వివరించినట్లు తెలిపారు.

ఒక్క ఉద్యోగిపైనే చర్యలా? ప్రిన్సిపాల్ బాధ్యత ఏమైంది?

ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన ప్రశ్న ఇదే. ఒకవేళ పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగినట్లు తేలితే కేవలం ఇన్విజిలేటర్‌పైనే చర్యలు తీసుకుని, మొత్తం పరీక్షా కేంద్రం నిర్వహణ బాధ్యత వహించే ప్రిన్సిపాల్‌ను విచారణ పరిధి నుంచి తప్పిస్తారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.పరీక్షా కేంద్రంలో విధుల కేటాయింపు, సిబ్బంది పర్యవేక్షణ, సీసీ కెమెరాల నిర్వహణ, పరీక్షల పారదర్శకత వంటి అంశాలకు సంబంధించి ప్రిన్సిపాల్ పాత్రను కూడా పూర్తిస్థాయిలో పరిశీలించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఒక్కొక్క లెక్చరర్ ను విడివిడిగా విచారించాలి:నగేష్ సూర్యవంశం

ఈ విచారణ కేవలం నామమాత్రంగా ముగియకూడదని, ప్రతి లెక్చరర్‌ను వ్యక్తిగతంగా విచారించాలని బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ సూర్యవంశం డిమాండ్ చేస్తున్నారు.

ఆయన ప్రధానంగా కోరుతున్న అంశాలు:

2026 మే సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన విద్యార్థుల నామినల్ రోల్స్ పరిశీలించాలి. పరీక్షల సమయంలో విధులు నిర్వహించిన ప్రతి ఇన్విజిలేటర్ వివరాలు సేకరించాలి.గొల్ల స్వామి ఇన్విజిలేషన్ డ్యూటీకి సంబంధించిన రికార్డులు, ఆయన కుమార్తె పరీక్షా కేంద్ర వివరాలను పరిశీలించాలి. పరీక్షల రోజులకు సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజీని స్వాధీనం చేసుకుని స్వతంత్రంగా విశ్లేషించాలి.ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్ పాత్రపై ప్రత్యేక విచారణ జరపాలి. నారాయణ జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులకు ఏమైనా అనుచిత సహకారం అందిందా అనే కోణంలో విచారణ చేపట్టాలి.ప్రతి లెక్చరర్‌ను విడివిడిగా విచారించి, వాంగ్మూలాలను నమోదు చేయాలి. విచారణలో తప్పులు నిర్ధారణ అయితే సంబంధిత ఉద్యోగులు, బాధ్యులపై CCA నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.

విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే సహించేది లేదు!

పరీక్షల నిర్వహణ అనేది వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అత్యంత కీలకమైన బాధ్యత. అలాంటి పరీక్షా కేంద్రాల్లో నిబంధనల ఉల్లంఘన జరిగితే అది కేవలం పరిపాలనా లోపం మాత్రమే కాదు.. విద్యార్థుల సమాన అవకాశాలపై ప్రభావం చూపే తీవ్రమైన అంశం.అందువల్ల ఈ వ్యవహారాన్ని ఉద్యోగ సంఘాల ఒత్తిళ్లకు, రాజకీయ పలుకుబడికి, అధికారుల నిర్లక్ష్యానికి వదిలేయకుండా ఉన్నతస్థాయి అధికారులతో స్వతంత్ర విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.ఇప్పుడు ఇంటర్మీడియట్ బోర్డు ముందున్న ప్రశ్న ఒక్కటే.. విచారణ పేరుతో కాలయాపన చేసి ఫైల్‌ను మూసివేస్తారా? లేక సీసీ కెమెరాల ఫుటేజీ నుంచి ప్రతి లెక్చరర్ వాంగ్మూలం వరకు సమగ్రంగా పరిశీలించి అసలు బాధ్యులను బయటపెడతారా?మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షల వ్యవహారంలో అసలు నిజాలు వెలుగులోకి రావాలంటే సమగ్ర, పారదర్శక విచారణే ఏకైక మార్గం అని, ఇలాంటి తప్పులు ఇకముందు జరగకూడదంటే ప్రస్తుతం ఇన్విజిలేషన్ చేసిన గొల్ల స్వామిని, ప్రిన్సిపల్ రేపాల శ్రీనివాసుని సస్పెండ్ చేసి భవిష్యత్తులో జరిగే అన్ని ఇన్విజిలేషన్ డ్యూటీ లకు వీరికి బాధ్యతలు అప్పగించకుండా చూడాలని నగేష్ సూర్యవంశం డిమాండ్ చేశారు

వికారాబాద్ లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మహిళలు, ఆటో డ్రైవర్ మృతి
- నలుగురి మృతితో పెండ్లి మడుగు గ్రామంలో విషాద ఛాయలు
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా పోలీసు ఉన్నతాధికారులు
- రోడ్డు గుంతలు, హెచ్చరిక బోర్డులు లేకపోవడమే కారణమంటున్న స్థానికులు





ప్రజా వాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో: వికారాబాద్ మండలం పెండ్లి మడుగు గ్రామానికి చెందిన నలుగురు ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మహిళలు, ఆటో డ్రైవర్ ప్రాణాలు కోల్పోవడంతో గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు.వివరాల్లోకి వెళితే.. పెండ్లి మడుగు గ్రామానికి చెందిన బుడ్డన్న భార్య చంద్రమ్మకు కాలు గాయం కావడంతో చెట్ల మందు తాగేందుకు ధరూర్ మండలం కెరెల్లి గ్రామానికి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నాగేష్ ఆటోలో చంద్రమ్మతో పాటు ఆమె తల్లి అక్కాపురం పర్వతమ్మ, కోడలు సరిత బయలుదేరారు. మార్గమధ్యలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురూ మృత్యువాత పడ్డారు.

మృతులు వీరే..

1. చంద్రమ్మ(బుడ్డన్న భార్య, పెండ్లి మడుగు)2. అక్కాపురం పర్వతమ్మ (చంద్రమ్మ తల్లి)3. సరిత(చంద్రమ్మ కోడలు)4. నాగేష్ (ఆటో డ్రైవర్, పెండ్లి మడుగు)ప్రమాదం జరిగిన స్థలాన్ని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డీఎస్పీ అంజయ్య,పట్టణ ఇన్స్పెక్టర్ రఘుకుమార్ తో కలిసి పరిశీలించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫూట్ రోడ్లపై ప్రయాణించే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని, పొగ మంచులో ప్రయాణించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వాహనదారులకు సూచించారు.కాగా, రోడ్లపై గుంతలు, ప్రమాద సూచిక బోర్డులు లేకపోవడమే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులపై గుంతలను పూడ్చి, అవసరమైన చోట ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంకెంతమంది బలి కావాలి?

- ప్రాణాలు తీస్తున్న రహదారులు
- నెరవేరని రూ.3 వేల కోట్ల హామీ!
- ప్రభుత్వంపై డాక్టర్ మెతుకు ఆనంద్ విమర్శలు
- వికారాబాద్ లో నలుగురి ప్రాణాలు బలిగొన్న ప్రమాదం
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్



ప్రజా వాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో: వికారాబాద్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపిందని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశారు. మృతులు నాగేష్, చంద్రమ్మ, పార్వతమ్మ, సరిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మూడేళ్లు గడిచినా మారని రోడ్ల పరిస్థితి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు గడుస్తున్నా వికారాబాద్ జిల్లాలో రహదారుల పరిస్థితి మెరుగుపడలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా, అసెంబ్లీ స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలోనే రోడ్లు అధ్వానంగా ఉండటం గమనార్హమన్నారు.

రూ.3 వేల కోట్ల హామీ అమలేది?

వికారాబాద్‌లో రోడ్ల అభివృద్ధికి రూ.3,000 కోట్లు కేటాయించి పనులు చేపడతామని స్పీకర్ ప్రకటించిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రకటనలు, హామీలకే పరిమితమవకుండా క్షేతస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలి

ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అధ్వానంగా ఉన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టడంతో పాటు ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రూ.3,000 కోట్ల రోడ్ల అభివృద్ధి హామీని అమలు చేసి పనులు ప్రారంభించాలని డాక్టర్ మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ప్రార్థించారు.

పదేళ్లుగా మురుగు ప్రవాహం

- అధికారులకు పట్టని ప్రజల గోడు.!
- పోలేనిగూడెంలో పారిశుద్ధ్యం పడకేసింది
- ప్రధాన రహదారి పక్కనే మురుగునీటి ప్రవాహం
- దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న గ్రామస్థులు
- దోమల విజృంభణతో వ్యాధుల భయం
- పదేళ్లుగా పరిష్కారం చూపని అధికార యంత్రాంగం
- ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి తీరుపై ప్రజల ఆగ్రహం

ప్రజా వాయిస్, చిలుకూరు:పదేళ్లుగా మురుగునీటి సమస్యతో ప్రజలు అవస్థలు పడుతున్నా అధికారుల చెవికి మాత్రం ఎక్కడం లేదు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం పోలేనిగూడెం గ్రామంలో పారిశుద్ధ్యం పూర్తిగా గాడితప్పింది. బరాఖత్ గూడెం నుంచి మిర్యాలగూడెం వెళ్లే ప్రధాన రహదారి పక్కనే నిరంతరం మురుగునీరు ప్రవహిస్తుండటంతో పరిసర ప్రాంతాలు దుర్వాసనతో నిండిపోతున్నాయి. ప్రయాణికులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.



హైతాబాద్‌లో ట్రేఫోయిల్ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం

- ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేసిన సిబ్బంది
- ప్రాణనష్టం లేదు మెటీరియల్ మాత్రమే దగ్ధం
- పరిశ్రమల ప్రాంతంలో ఫైర్ ఔట్ పోస్ట్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం
- జిల్లా ఫైర్ ఆఫీసర్ కరీముల్లా

(ప్రజా వాయిస్ షాబాద్)రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలం హైతాబాద్‌లోని ఇండస్ట్రియల్ పార్కులో ఉన్న ట్రేఫోయిల్ ప్యాకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కంపెనీ ప్రాంగణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి క్షణాల్లోనే భారీగా వ్యాపించడంతో పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. మంటలు భారీ ఎత్తున ఎగిసిపడటంతో కంపెనీ సిబ్బంది, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. షాద్‌నగర్, వికారాబాద్, మహేశ్వరం ప్రాంతాల నుంచి ఫైర్ సిబ్బంది ఫైర్ ఇంజన్లతో చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.ఈ సందర్భంగా జిల్లా ఫైర్ ఆఫీసర్ కరీముల్లా మాట్లాడుతూ.. విద్యుత్ కేబుల్స్ వేడెక్కి అగ్నిప్రమాదం సంభవించి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, మెటీరియల్ మాత్రమే కాలిపోయిందని వెల్లడించారు. యంత్రాలు యథావిధిగా పనిచేస్తున్నాయని తెలిపారు.కంపెనీలోని ఎమర్జెన్సీ జనరేటర్ పనిచేయలేదన్న అంశంపై కూడా పరిశీలన చేస్తామని చెప్పారు. ప్రస్తుతం కంపెనీలో పొగ అలుముకోవడంతో నష్టాన్ని అంచనా వేయడం సాధ్యం కాలేదని, పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాత ఆస్తి నష్టం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.హైతాబాద్ ఇండస్ట్రియల్ పార్కుతో పాటు పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు పెద్ద సంఖ్యలో ఏర్పాటవుతున్నాయని జిల్లా ఫైర్ ఆఫీసర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే స్పందించేందుకు ఈ ప్రాంతంలో ప్రత్యేక ఫైర్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.ప్రమాదానికి గల అసలు కారణాలు, జరిగిన ఆస్తి నష్టంపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాల్సి ఉంది.





బీఆర్ఎస్‌కు భారీ షాక్..

- కాంగ్రెస్ లోకి తుమ్మలపల్లి సర్పంచ్, వార్డు సభ్యుల చేరిక

ప్రజావాయిస్/మర్వల్లి: తుమ్మలపల్లిలో సర్పంచ్ కర్నే రాజు ఆధ్వర్యంలో భారీ చేరికలు వికారాబాద్ జిల్లా మర్వల్లి మండలం తుమ్మలపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. గ్రామ సర్పంచ్ కర్నే రాజు ఆధ్వర్యంలో దాదాపు 200 మంది బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు కాంగ్రెస్ కండువాలు కప్పు కున్నారు ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు.వికారాబాద్ ఎమ్మెల్యే, శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో తుమ్మలపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ కర్నే రాజు తెలిపారు.గ్రామంలో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

షెడ్డు కట్టేది నేనే..శాఖలను "సెట్"చేసేదీ నేనే.?

- ఇందిరాగాంధీ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఓ వ్యక్తి బలవంతపు దందా
- నిర్మాణ కాంట్రాక్టుకు ఒక రేటు.... అధికారుల మేనేజ్ మెంట్ కు మరో రేటు
- టౌన్ ప్లానింగ్,రెవెన్యూ, కరెంట్ శాఖల పేర్లతో లక్షల్లో నిలువు దోపిడీ
- నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం
- పట్టణ ప్రణాళిక విభాగం అధికారి శ్రీధర్



ప్రజావాయిస్|| రాజేంద్రనగర్:అత్తాపూర్ జిహెచ్ఎంసి సర్కిల్ ఇందిరాగాంధీ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఓ వ్యక్తి సాగిస్తున్న బలవంతపు దందా ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.సొసైటీ నిబంధనలకు పాతర వేస్తూ,ప్రభుత్వ శాఖల పేర్లను అడ్డం పెట్టుకుని సదరు వ్యక్తి సాగిస్తున్న "డబుల్ దోపిడీ"యవ్వారం బట్టబయలైంది."షెడ్డు కట్టేది నేనే...ఏ అధికారీ రాకుండా శాఖలను సెట్ చేసేదీ నేనే".? అంటూ అతడు సాగిస్తున్న అంతర్గత బేరాలు సొసైటీ వర్గాల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్నాయి.

బలవంతపు కాంట్రాక్టు" అదనపు బాదుడు

సొసైటీ పరిధిలో ఎవరైనా షెడ్డు నిర్మించుకోవాలంటే బయటి కాంట్రాక్టర్లకు అనుమతి లేదన్నట్లుగా సదరు వ్యక్తి వ్యవహరిస్తున్నాడు.షెడ్డు నిర్మాణ కాంట్రాక్టు పనులు కచ్చితంగా తనకే అప్పగించాలని,తాను చెప్పిన రేటుకే పనులు చేయించుకోవాలని హుకుం జారీ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే దోపిడీ అక్కడితో ఆగలేదు.అసలు కథ ఆ తర్వాతే మొదలవుతోంది.

శాఖకో రేటు...ప్యాకేజీల పేరిట లక్షల్లో వసూళ్లు?

నిర్మాణ కాంట్రాక్టుకు ఒక రేటు ఫిక్స్ చేస్తున్న సదరు వ్యక్తి,ఆ షెడ్డుకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఉండేందుకు"మేనేజ్‌మెంట్" పేరుతో మరో భారీ రేటును వసూలు చేస్తున్నాడు.మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలకు రాకుండా ఉండేందుకు కొంత..ఇంటి నంబర్ మంజూరులో రెవెన్యూ సెక్షన్ నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాకుండా ఉండేందుకు మరికొంత,విద్యుత్ శాఖ(కరెంట్) నుంచి కనెక్షన్,ఇతర సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఇంకొంత,ఇలా మూడు కీలక ప్రభుత్వ శాఖల పేర్లు చెబుతూ బాధితుల నుంచి లక్షల రూపాయలు పిండుకుంటున్నట్లు తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. "అడిగినంత ఇస్తే చాలు,ఏ శాఖా మీ వైపు కన్నెత్తి చూడదు,అంతా నేనే చూసుకుంటా"అంటూ అతడు ఇచ్చే హామీలు చూస్తుంటే,అసలు ప్రభుత్వ యంత్రాంగం ఇతడి జేబులో ఉందా.? అన్న అనుమానాలు కలుగుతున్నాయి.ప్రభుత్వ శాఖల ప్రతిష్టను దిగజారుస్తూ,సొసైటీని తన సొంత జాగీరులా మార్చుకుని"కాంట్రాక్టు మాఫియా"నడుపుతున్న సదరు వ్యక్తిపై ఉన్న తాధికారులు తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు,సొసైటీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

చట్టపరమైన చర్యలు తప్పవు,అధికారి శ్రీధర్

ఇందిరాగాంధీ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో జరుగుతున్న ఈ అక్రమ వసూళ్లు,నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న షెడ్ల నిర్మాణాల వ్యవహారాన్ని పట్టణ ప్రణాళిక విభాగం అధికారి శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన తీవ్రంగా స్పందించారు.ప్రభుత్వ శాఖల పేర్లు చెప్పి ఎవరైనా వసూళ్లకు పాల్పడినా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.సదరు వ్యవహారంపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి,సంబంధిత వ్యక్తులకు తక్షణమే నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారి శ్రీధర్ వెల్లడించారు.



ముదిరాజ్ బజార్‌లో పోలీసుల 'కార్డెన్ అండ్ సెర్చ్'

- 128 ఇళ్లలో విస్తృత తనిఖీలు.. 15 వాహనాలు సీజ్
- డ్రగ్స్, సైబర్ నేరాలపై డీఎస్పీ అరుణ్ కుమార్ అవగాహన
- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రజలకు సూచన

భద్రాచలం, ప్రజా వాయిస్: నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా భద్రాచలం పట్టణంలోని ముదిరాజ్ బజార్‌లో పోలీసులు ఆదివారం తెల్లవారుజామున విస్తృతంగా కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో 128 ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 61 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలను గుర్తించగా.. నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 15 వాహనాలను సీజ్ చేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. యువత గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి విక్రయం, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిజిటల్ అరెస్ట్, నకిలీ లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్, సీటుబెల్టు ధరించడంతో పాటు సరైన పత్రాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు, టీజీఎస్పీ, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.





పొగమంచు కారణంగా ఘోర రోడ్డు ప్రమాదం

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు పలువురికి తీవ్ర గాయాలు
- ఇద్దరు ఫోటోగ్రాఫర్ల పరిస్థితి విషమం,

ప్రజావాయిస్ రాజన్న సిరిసిల్ల పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట సిగ్నల్ వద్ద ఆదివారం ఉదయం ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారుకోనరావుపేట వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును బైపాస్ రోడ్డుపై ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా ధ్వంసమైంది కారులో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్ర గాయాలయ్యాయి వారిలో ఇద్దరు ఫోటో గ్రాఫర్ల పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు ప్రమాద సమాచారం తెలుసుకున్న స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు పొగమంచు కారణంగా రహదారులపై దృశ్యమానత తగ్గడంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.

జలమండలి లో ఫిర్యాదుల నమోదుకు ప్రజల తిప్పలు

- వెబ్ సైట్ నుంచి అధికారుల ఫోన్ నంబర్ల తొలగింపు..

హైదరాబాద్ ప్రజా వాయిస్ : నగర ప్రజలకు తాగునీరు, మురుగునీటి పారుదల సేవలు అందించే హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (జలమండలి) అధికారిక వెబ్‌సైట్ నుంచి ఇంజినీర్లు, అధికారుల ఫోన్ నంబర్లను తొలగించడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో వెబ్‌సైట్‌లో క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు అందరి కాంటాక్ట్ వివరాలు అందుబాటులో ఉండేవి. కానీ, ఇటీవల ఆ వివరాలను తొలగించడంతో ఏదైనా సమస్య తలెత్తితే ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు.సెక్షన్ల స్థానంలో వార్డుల ఏర్పాటుతో మరింత గందరగోళంఇటీవల జలమండలి పరిధిలో పరిపాలనాపరమైన మార్పులు చోటుచేసుకున్నాయి. పాత 'సెక్షన్' వ్యవస్థ స్థానంలో కొత్తగా 'వార్డు' వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో గతంలో ఉన్న ఒక్కో సెక్షన్, ప్రస్తుతం రెండు లేదా మూడు వార్డులుగా విభజించబడింది. ఏ వార్డు ఏ సర్కిల్ పరిధిలోకి వస్తుంది?ఆయా వార్డులకు బాధ్యులైన ఇంజినీర్లు, అధికారులు ఎవరు? వారికి పైఅధికారులుగా ఎవరు వ్యవహరిస్తున్నారు?అనే అంశాలపై ప్రజలకు కనీస అవగాహన లేకుండా పోయింది.విచిత్రమేమిటంటే, క్షేత్రస్థాయిలో పనిచేసే కొందరు జలమండలి సిబ్బందికి సైతం కొత్త వార్డులు, సర్కిళ్ల సరిహద్దులపై పూర్తి స్పష్టత లేకపోవడం గమనార్హం.

HMWSSB
HYDERABAD METROPOLITAN VATER SUPPLY & SEWERAGE BOARD

ప్రజల ప్రధాన డిమాండ్లు:

వెబ్‌సైట్‌లో వివరాల పునరుద్ధరణ : ప్రతి వార్డు, సర్కిల్, జోనల్ స్థాయి అధికారులు, ఇంజినీర్ల పేర్లు, హోదాలు మరియు అధికారిక ఫోన్ నంబర్లను జలమండలి వెబ్‌సైట్‌లో తక్షణమే పొందుపరచాలి. కార్యాలయాల్లో నోటీసు బోర్డులు : వెబ్‌సైట్‌తో పాటు స్థానిక జలమండలి కార్యాలయాల్లోనూ ఆయా పరిధిలోని అధికారుల ఫోన్ నంబర్లు, వార్డుల వివరాలను ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలి.తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినా, డ్రైనేజీ పొంగిపొర్లినా తక్షణమే స్థానిక అధికారికి సమాచారం అందించే వీలు లేకపోవడంతో సమస్యలు జఠిలమవుతున్నాయి. ఇకనైనా జలమండలి ఉన్నతాధికారులు స్పందించి, అధికారుల ఫోన్ నంబర్లను అందుబాటులోకి తీసుకురావాలని నగరవాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ప్రజా వాయిస్ ఎఫెక్ట్

- భూ భారతి పోర్టల్ లో భూ మాయాజాలం
- అసలు యజమాని స్థానంలో నకిలీ వ్యక్తి.. ఆధార్ వివరాలూ ఫేక్
- రెండు ఎకరాల భూమిని కాజేసేందుకు పక్కా స్కెచ్
- తహసీల్దార్ అప్రమత్తతతో బట్టబయలు.. ముగ్గురు అరెస్ట్
- మరొక నిందితుడు పరార్
- నిందితులకు జ్యుడీషియల్ రిమాండ్



ప్రజా వాయిస్,సంగారెడ్డి:భూముల రికార్డుల భద్రతకు కీలకమైన భూ భారతి పోర్టల్‌నే అక్రమాలకు వేదికగా మార్చేందుకు కొందరు కేటుగాళ్లు ప్రయత్నించారు. అసలైన భూ యజమాని పేరుతో నకిలీ ఆధార్ వివరాలు సృష్టించి, భూ రికార్డుల్లో అక్రమ మార్పులు చేసి, మరో వ్యక్తిని అసలు యజమానిగా చిత్రీకరిస్తూ రెండు ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించేందుకు పన్నిన కుట్రను సంగారెడ్డి పోలీసులు భగ్నం చేశారు. తహసీల్దార్ అప్రమత్తతో వ్యవహరించడంతో బాగోతం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు.ఈ నెల 21న సాయంత్రం సంగారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామ శివారులోని సర్వే నంబర్ 228/Aలో ఉన్న రెండు ఎకరాల భూమిని భూ భారతి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించేందుకు నలుగురు వ్యక్తులు వచ్చారు. వారిలో ఒకరు అసలైన భూ యజమాని జి. రాజేంద్ర ప్రసాద్‌గా నటిస్తున్నట్లు తహసీల్దార్‌కు అనుమానం రావడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.రంగంలోకి దిగిన సంగారెడ్డి టౌన్ ఇన్స్పెక్టర్ రామునాయుడు ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. ఇమ్తియాజ్ అహ్మద్ (సంగారెడ్డి), నవీద్ అహ్మద్, రామచంద్ర (బీదర్, కర్ణాటక)లు కలిసి అసలు భూ యజమాని పేరుతో ఉన్న వివరాలను అక్రమంగా మార్చినట్లు విచారణలో వెల్లడైంది. రామచంద్ర ఆధార్ వివరాలను మార్చి నకిలీ ఆధార్ ఆధారంగా భూ భారతి పోర్టల్‌లో రికార్డులు సవరించి ఈ-పట్టాదార్ పాస్‌బుక్ పొందినట్లు పోలీసులు గుర్తించారు.ఇదే క్రమంలో ఈ నెల 19న రూ.2,30,773 రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించి స్లాట్ కూడా బుక్ చేసుకున్నారు. రామచంద్రను అసలు భూ యజమానిగా నమ్మించి రిజిస్ట్రేషన్ చేయించేందుకు పథకం వేశారు. అయితే భూమికి సంబంధించిన తప్పనిసరి ఓఆర్‌సీ (ORC) సర్టిఫికెట్ సమర్పించకపోవడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. తహసీల్దార్ విచారణలో అక్రమాలు బయటపడటంతో పోలీసులకు ఫిర్యాదు అందింది.దీంతో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నారు. ఈ కేసులో మరో నిందితుడు పరారీలో ఉండగా, అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

భూముల లావాదేవీల్లో అప్రమత్తంగా ఉండాలి

భూముల కొనుగోలు, అమ్మకాల సమయంలో పట్టాదార్ పాస్‌బుక్‌లు, ఆధార్ వివరాలు, భూ రికార్డులు, ఇతర ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సంగారెడ్డి జిల్లా పోలీసులు ప్రజలకు సూచించారు. నకిలీ పత్రాలు సృష్టించడం, ప్రభుత్వ పోర్టల్‌లో అక్రమ మార్పులు చేయడం, ఇతరుల భూములను మోసపూరితంగా విక్రయించేందుకు ప్రయత్నించడం తీవ్రమైన నేరాలని, ఇలాంటి అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ బరోసా

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- బూచన్ పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల్లో పాల్గొని వస్త్రాల అందజేత

ప్రజావాయిస్/మర్వల్లి: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఆదివారం మర్వల్లి మండలం బూచన్‌పల్లి గ్రామంలో కుంటెల్లి గోపాల్–పెంటమ్మ, లసుంపురం భాగ్యమ్మ–జనార్దన్ రెడ్డి కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రెండు కుటుంబాలకు తన సొంత ఖర్చులతో నూతన వస్త్రాలను అందజేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా కృషి చేస్తామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



లాడ్జిలలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

- రికార్డులు, గుర్తింపు పత్రాల పరిశీలన
- చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు
- సీఐ కొమ్ము తిరుపతి, ఎస్ఐ జి. శ్యాంరాజ్

ప్రజా వాయిస్, కోరుట్ల:పట్టణంలోని పలు లాడ్జిలలో పోలీసులు ఆదివారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కోరుట్ల సీఐ కొమ్ము తిరుపతి, ఎస్ఐ జి. శ్యాంరాజ్ సిబ్బందితో కలిసి లాడ్జిలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా లాడ్జిలలో బస చేస్తున్న వ్యక్తుల వివరాలు, వారి గుర్తింపు పత్రాలతో పాటు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్లలో నమోదు చేయాలని రిసెప్షన్ సిబ్బందికి, నిర్వాహకులకు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కొత్తవారు బస చేసినట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. లాడ్జిలను అసాంఘిక, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అడ్డాగా మార్చకుండా నిర్వాహకులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా, వాటికి సహకరించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సీఐ తిరుపతి స్పష్టం చేశారు.

అమెరికాలో ఆరిపోతున్న నల్లగొండ యువత జీవితాలు!

- రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువత మృతి
- 18 రోజులుగా ఆచూకీ లేని మరో విద్యార్థిని
- ఉద్యోగంలో చేరిన వారానికే సాయితేజ దుర్మరణం
- ఆరు నెలల క్రితం నవ్య మృతి
- బోస్టన్ లో శ్రీజారెడ్డి అదృశ్యం
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబాలు







ప్రజావాయిస్ | హుజూర్‌నగర్ | నవంబర్ 22 బంగారు భవిష్యత్తు కోసం అగ్రరాజ్యం అమెరికాకు వెళ్లిన నల్లగొండ జిల్లా యువత జీవితాల్లో వరుస విషాదాలు అలుముకుంటున్నాయి. ఉన్నత చదువులు పూర్తి చేసుకుని ఉద్యోగాల్లో స్థిరపడుతున్న తరుణంలోనే మృత్యువు కబళిస్తుండగా.. మరోవైపు చదువుల కోసం వెళ్లిన యువతి అదృశ్యమై 18 రోజులు గడుస్తున్నా ఆచూకీ లభించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒకే జిల్లాకు చెందిన ఇద్దరు యువత రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోగా, మరో విద్యార్థిని జాడ తెలియకపోవడంతో బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి.

ఉద్యోగంలో చేరిన వారానికే విషాదం

మునుగోడుకు చెందిన ప్రసాద్, శ్రీకన్య దంపతుల పెద్ద కుమారుడు ఈరమల్ల సాయితేజ (25) ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లారు. విద్యాభ్యాసం పూర్తి చేసుకుని ఇటీవలే ఉద్యోగం సాధించారు. విధుల్లో చేరి వారం రోజులు కూడా గడవకముందే నవంబర్ 19న న్యూయార్క్ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆయన ప్రయాణిస్తున్న కారుకు అకస్మాత్తుగా జింక అడ్డు రావడంతో వాహనం నిలిచిపోయింది. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన సరకు రవాణా వ్యాన్ కారును ఢీకొట్టడంతో సాయితేజ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కుమారుడు ఉద్యోగంలో స్థిరపడ్డాడని సంతోషించేలోపే విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

ఆరు నెలల క్రితమే మరో విషాదం

సాయితేజ ఘటన మరువకముందే గతంలో చోటుచేసుకున్న మరో విషాదం జిల్లావాసులను కలచివేస్తోంది. చెర్వుగట్టుకు చెందిన నవ్య (24) సైతం ఆరు నెలల క్రితం అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ విషాదం నుంచి కుటుంబ సభ్యులు ఇంకా కోలుకోకముందే మరో యువకుడు మృత్యువాత పడటం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

18 రోజులుగా లభించని శ్రీజారెడ్డి ఆచూకీ

కనగల్ మండలం శాబ్దుల్లాపురానికి చెందిన యాదగిరిరెడ్డి, రూప దంపతుల ఏకైక కుమార్తె కోయ శ్రీజారెడ్డి (23) అదృశ్యం మరోవైపు తీవ్ర కలకలం రేపుతోంది. బోస్టన్‌లోని మసాచుసెట్స్ యూనివర్సిటీలో ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతున్న ఆమె.. ఈ నెల 2వ తేదీ రాత్రి డోర్చెస్టర్ ప్రాంతంలోని నివాసం నుంచి వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి 18 రోజులుగా ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. బోస్టన్ పోలీసులు కార్సన్ బీచ్, హార్బర్ పాయింట్ పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు సైతం విదేశాంగ శాఖ, భారత కాన్సులేట్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. తమ ఏకైక కుమార్తె క్షేమంగా తిరిగి రావాలని తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వాలు అండగా నిలవాలి

ఎన్నో ఆశలతో పిల్లలను విదేశాలకు పంపిన తల్లిదండ్రులకు అక్కడి నుంచి అందుతున్న విషాద వార్తలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆప్తులను కోల్పోయిన సాయితేజ, నవ్య కుటుంబాలకు ప్రభుత్వాలు అండగా నిలవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. అదృశ్యమైన శ్రీజారెడ్డి ఆచూకీని వీలైనంత త్వరగా కనుగొనేందుకు విదేశాంగ శాఖ ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులు, ఉద్యోగుల భద్రతపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. వరుస ఘటనలు నల్లగొండ జిల్లా ఎన్నారై కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని, ఆందోళనను నింపుతున్నాయి.

ప్రజా వాయిస్ ఎఫెక్ట్

- బుద్వేల్ అక్రమ లేఅవుట్ కు చెక్
- రిజిస్ట్రేషన్లు ఆపాలని జీహెచ్ఎంసీ లేఖ
- సర్వే నంబర్లు 521,522, 523,524లో అనుమతులు లేకుండా లేఅవుట్ ఏర్పాటు
- సేల్ డీడ్,గిఫ్ట్ డీడ్,జీపీఏ, అగ్రిమెంట్ ఆఫ్ సేల్, తనఖా ,లీజు రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని ఆదేశం
- యజమానులు, నిర్మాణాలకు షోకాజ్ నోటీసులు తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు లావాదేవీలు చేపట్టవద్దని సబ్ రిజిస్ట్రార్ కు సర్కిల్-19 డిప్యూటీ కమిషనర్ లేఖ





ప్రజావాయిస్||రాజేంద్రనగర్:మండలం బుద్వేల్ గ్రీన్ సిటీలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్ వ్యవహారంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కీలక చర్యలకు ఉపక్రమించింది.సదరు భూముల్లో ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేపట్టవద్దంటూ రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండల సబ్ రిజిస్ట్రార్‌కు జీహెచ్ఎంసీ సర్కిల్-19 డిప్యూటీ కమిషనర్ అధికారికంగా లేఖ రాశారు.బుద్వేల్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 521,522,523,524లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా లేఅవుట్ ఏర్పాటు చేస్తున్నట్లు గత నెల 23 వ తేదీన"అనుమతులు నిల్ రిజిస్ట్రేషన్ లు ఫుల్"అనే శీర్షికతో ప్రజావాయిస్ పత్రికలో ప్రచురితం అయిన సంగతి విధితమే.దీనికి తోడు ఓ వ్యక్తి సైతం ఈ నెల 10న జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు స్పందించిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు సంబంధిత స్థలాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.లేఅవుట్ ఏర్పాటుకు సంబంధించిన అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు పొందలేదని తనిఖీల్లో నిర్ధారించారు.షోకాజ్ నోటీసుల జారీఅనుమతులు లేని లేఅవుట్‌ను గుర్తించిన జీహెచ్ఎంసీ అధికారులు ఈ నెల 10,11 తేదీల్లో సంబంధిత భూముల యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అంతే కాకుండా సదరు లేఅవుట్‌లో కొనసాగుతున్న నిర్మాణాలకు సంబంధించి కూడా నోటీసులు అందజేశారు.ప్రజా వాయిస్ ఎఫెక్ట్అక్రమ లేఅవుట్ కు బ్రేక్ సామాన్యులకు ఊరటబుద్వేల్ లోని నాలుగు సర్వే నంబర్లలో అనుమతులు లేని లేఅవుట్‌పై జీహెచ్ఎంసీ అధికారులు వేగంగా స్పందించి రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని లేఖ రాయడంపై స్థానికుల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు, భూములు కొనుగోలు చేసి సామాన్యులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంటుందని, ముందుగానే రిజిస్ట్రేషన్లు ఆపితే ఎవరూ మోసపోకుండా ఉంటారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇదే తరహాలో మిగతా అక్రమ లేఅవుట్లపైనా అధికారులు కఠినంగా వ్యవహరించి ప్రజల కష్టార్జితాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

- ఇద్దరిని పట్టివేత.. ఆరుగురు పరారీ
- ఆరు బైకులు, మూడు కోడి పుంజులు స్వాధీనం

ప్రజా వాయిస్ మహదేవపూర్ కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బేగ్లూర్ గ్రామంలో జరిగిన ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులు పట్టుబడగా, మరో ఆరుగురు పోలీసులను గమనించి పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పిడుగు తిరుపతి, మల్హర్ మండలం ఇప్పలపల్లికి చెందిన కవేటి రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. పరారైన వారిలో బేగ్లూర్‌కు చెందిన కారు గణేష్, కారు శ్రీకాంత్, కొయ్యాల దాసు, ఆకుల వెంకన్న, కారు మల్లయ్యతో పాటు సూరారం గ్రామానికి చెందిన రాకేష్ ఉన్నట్లు గుర్తించారు.

ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

దాడి సందర్భంగా ఘటనా స్థలంలో రెండు మొబైల్ ఫోన్లు (రెడ్‌మీ, వివో), రూ.500 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, మూడు కోడి పుంజులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఇద్దరితో పాటు పరారైన మరో ఆరుగురిపై కేసు నమోదు చేసి చట్ట పరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

సమాచారం ఇవ్వండి.. వివరాలు గోప్యంగా ఉంచుతాం

కోడిపందేలు, జూదం, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరూ పాల్పడవద్దని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 8712658116 లేదా డయల్ 112కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు స్పష్టం చేశారు.





ఇందిరమ్మ ఇళ్లకు రాజకీయ అడ్డంకులు

- పేదలకు ఇళ్లు రాకుండా అడ్డుకున్న కాంగ్రెస్ సర్పంచ్
- గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట బాధితుల నిరసన
- అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్

ప్రజా వాయిస్ దౌల్తాబాద్, నవంబర్ 22: అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాకుండా రాజకీయ కారణాలతో అడ్డంకులు సృష్టిస్తున్నారని మాచిన్‌పల్లి సర్పంచ్ బొక్కల నాగరాజుపై బాధితులు ఆరోపించారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ తాము బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారమనే కారణంతో ఇళ్లు రాకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లి గ్రామానికి చెందిన గుండబోయిన లక్ష్మి, మామిండ్ల నవనీత, శేరిల శిరోల్ల సుశీల, కమ్మరి శివలక్ష్మి, కర్రోళ్ల యాదమ్మలు ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత జాబితాలో అర్హులుగా ఎంపికయ్యారు. అయితే తమకు ఇళ్లు మంజూరు కాకుండా కాంగ్రెస్ సర్పంచ్ బొక్కల నాగరాజు అడ్డుకుంటున్నారని బాధితులు ఆరోపించారు. ఇటీవల ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామికి సర్పంచ్ వినతిపత్రం అందజేసి, తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయవద్దని కోరినట్లు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఆదివారం బాధితులు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గతంలో కురిసిన భారీ వర్షాలకు తమ ఇళ్లు కూలిపోయాయని, ప్రస్తుతం అద్దె ఇళ్లలో ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కన్నీటిపర్యంతమయ్యారు. తమకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, నిరుపేదలమైన తమకు రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ రాజకీయ కక్షతో ఇందిరమ్మ ఇళ్లు రాకుండా అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఇప్పటికైనా మంత్రి వివేక్ వెంకటస్వామి స్పందించి ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని బాధితులు కోరారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులైన తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆకలి తీర్చడమే అయ్యప్ప సేవగా..!

- 13 ఏళ్లుగా నిత్య అన్నదానంతో 'రమేష్ నాయుడు బ్రదర్స్' సేవా ప్రస్థానం
- కోదాడలో రోజూ 400 నుంచి 500 మంది మాలధారులకు అన్నప్రసాదం
- ఏ మాలధారులైనా ఆహ్వానమే
- సొంత స్థలాన్ని సేవకు అంకితం చేసిన సీనియర్ గురుస్వామి శ్రీనివాస నాయుడు

ప్రజా వాయిస్,కోదాడ: ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టడం కంటే మించిన సేవ మరొకటి లేదని నమ్మిన ఆయన.. ఆ మాటను చేతల్లో చూపిస్తున్నారు. ఒక రోజు కాదు.. ఒక ఏడాది కాదు.. ఏకంగా 13 ఏళ్లుగా నిరంతరాయంగా అన్నదాన యజ్ఞాన్ని కొనసాగిస్తున్నారు. ఏ మాల వేసుకున్నా సరే.. ఏ ప్రాంతం నుంచి వచ్చినా సరే.. ఆకలితో వచ్చిన ప్రతి స్వామికి ఆప్యాయంగా అన్నప్రసాదం అందిస్తున్నారు. దివంగత సోదరుడు రమేష్ నాయుడు జ్ఞాపకార్థం ప్రారంభించిన ఈ సేవకు తన సొంత స్థలాన్నే అంకితం చేశారు. కోదాడకు చెందిన సీనియర్ గురుస్వామి, న్యాయవాది శ్రీనివాస నాయుడు కుటుంబం నిర్వహిస్తున్న ఈ మహత్తర సేవ వేలాది మంది మాలధారుల ఆకలి తీరుస్తూ సేవా స్ఫూర్తికి చిరునామాగా నిలుస్తోంది.

మాల ఏదైనా.. అన్నం మాత్రం అందరికీ

కోదాడ పట్టణంలోని విజయ్‌నగర్ బైపాస్ మెయిన్ రోడ్డులో, అయ్యప్ప దేవస్థానానికి సమీపంలో 'రమేష్ నాయుడు బ్రదర్స్' పేరుతో ఈ అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. అయ్యప్ప స్వాములతో పాటు వెంకటేశ్వర స్వామి, లక్ష్మీనరసింహ స్వామి, శివ స్వామి, ఆంజనేయ స్వామి మాలధారులు సైతం ఇక్కడ అన్నప్రసాదం స్వీకరించవచ్చు. ప్రతిరోజూ మధ్యాహ్నం 12.30 గంటలకు భోజనం సిద్ధంగా ఉంటుంది. రోజుకు సుమారు 400 నుంచి 500 మంది స్వాములు భోజనం చేస్తుండగా.. ఏడాదికి దాదాపు 20 వేల నుంచి 30 వేల మందికి అన్నదానం అందుతోంది. ప్రత్యేకత ఏమిటంటే.. ఈ సేవ ఏడాది పొడవునా కొనసాగడం.

సొంత స్థలమే.. స్వాముల సేవకే

సాధారణంగా విలువైన స్థలాలను ఆదాయం కోసం వినియోగిస్తుంటారు. కానీ శ్రీనివాస నాయుడు మాత్రం తన సొంత స్థలాన్ని కిరాయికి ఇవ్వకుండా స్వాముల అన్నదాన సేవకే కేటాయించారు. దివంగత సోదరుడి జ్ఞాపకాన్ని కేవలం స్మరణకే పరిమితం చేయకుండా.. వేలాది మంది ఆకలి తీర్చే మహత్తర కార్యక్రమంగా మలిచారు. దాతల సహకారంతో అన్నదానం కొనసాగుతున్నప్పటికీ, ఎప్పుడైనా ఆర్థిక లోటు ఏర్పడితే స్వయంగా భరిస్తూ కార్యక్రమానికి ఆటంకం కలగకుండా చూసుకుంటున్నారు.

అన్నదానమే కాదు.. ఆపన్నులకు అండగా

శ్రీనివాస నాయుడు సేవలు అన్నదానంతోనే ఆగిపోవడం లేదు. స్వాముల పూజల కోసం ప్రత్యేక పీఠం ఏర్పాటు చేశారు. ఆర్థికంగా వెనుకబడిన భక్తులకు మాలధారణ చేయించి శబరిమల యాత్రకు తీసుకెళ్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే స్వాములకు వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. భక్తులకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ గురుస్వామిగా తన బాధ్యతను నిర్వర్తిస్తున్నారు.

30 ఏళ్లుగా అయ్యప్ప స్వామి సేవలో..

గత మూడు దశాబ్దాలుగా అయ్యప్ప మాల ధరిస్తూ సీనియర్ గురుస్వామిగా భక్తులకు మార్గదర్శనం చేస్తున్నారు శ్రీనివాస నాయుడు. గతంలో ఇంటి సమీపంలోని అయ్యప్ప దేవస్థానంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల నుంచి స్ఫూర్తి పొంది 13 ఏళ్ల క్రితం తన సొంత స్థలంలో ఈ సేవకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి నేటి వరకు విరామం లేకుండా కొనసాగిస్తున్నారు.



సేవలోనే సోదరుడి జ్ఞాపకం..

దివంగత సోదరుడు రమేష్ నాయుడు జ్ఞాపకార్థం ప్రారంభించిన ఈ కార్యక్రమం నేడు వందలాది మంది స్వాములకు నిత్య అన్నపూర్ణగా మారింది. మాల పేరుతో, ప్రాంతం పేరుతో ఎలాంటి భేదం చూపకుండా ప్రతి భక్తుడికీ అన్నప్రసాదం అందించడం ఈ సేవలోని గొప్పతనం. 'అయ్యప్ప స్వామి అనుగ్రహంతోనే ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో మేము కేవలం నిమిత్తమాత్రులం మాత్రమే' అని శ్రీనివాస నాయుడు వినమ్రంగా చెబుతున్నారు.ఆకలి తీర్చే ప్రతి ముద్దలో సోదరుడి జ్ఞాపకం.. ప్రతి స్వామి చిరునవ్వులో సేవకు సార్థకత.. ఇదే రమేష్ నాయుడు బ్రదర్స్ 13 ఏళ్ల అన్నదాన ప్రస్థానంలోని అసలైన సందేశం. కోదాడలో మొదలైన ఈ సేవా యజ్ఞం మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తోంది.



కారోబార్ రవి ఆరోపణలు అవాస్తవం

నకిలీ డెత్ సర్టిఫికెట్ల స్కాంకు మాజీ జెడ్పీ వైస్ చైర్మన్, ఎంపీడీవోలే కారణం

కాంగ్రెస్ నేతలు బత్తుల రవి, వెంబడి సురేష్ స్పష్టీకరణ

బెల్లంపల్లి / ప్రజా వాయిస్

బెల్లంపల్లి: నకిలీ డెత్ సర్టిఫికెట్ల జారీ వ్యవహారంలో తమకు ఎలాంటి సంబంధం లేదని, బూదాకుర్ద్ కారోబార్ చిలుముల రవి తమపై చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి బత్తుల రవి, కాంగ్రెస్ నాయకుడు వెంబడి సురేష్ స్పష్టం చేశారు.ఆదివారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నకిలీ డెత్ సర్టిఫికెట్ల కుంభకోణానికి మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, బెల్లంపల్లి ఎంపీడీవో మహేందర్ ప్రధాన కారణమని ఆరోపించారు. బూదాకుర్ద్ గ్రామపంచాయతీలో మొత్తం 16 సర్టిఫికెట్లు జారీ కాగా, వాటిలో అత్యధికంగా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ బంధువుల పేర్లతో ఉన్నాయని పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై పోలీసులు చేపడుతున్న విచారణకు తాము పూర్తిస్థాయిలో సహకరిస్తామని తెలిపారు. కారోబార్ చిలుముల రవిని కేసు నుంచి బయటపడేసేందుకు, ఆయనకు బెయిల్ ఇప్పించేందుకు సత్యనారాయణ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మహిళా సర్పంచ్ ఉన్నప్పటికీ గ్రామ అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు,ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ దుర్గం శ్రీనివాస్ మాజీ ఎమ్మెల్యే కి బంధువు, ఎంపీడీవో డ్రైవర్ చిలుముల రవి, బీఆర్ఎస్ నాయకుడు అశోక్ గౌడ్, బూదాకుర్ద్ వార్డు సభ్యుడు ఎంబడి చంద్రశేఖర్‌లు ఎంపీడీవోతో సంబంధాలు కలిగి ఉండి, కారోబార్ చిలుముల రవి ద్వారా ఈ వ్యవహారాన్ని నడిపించారని ఆరోపించారు,ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బరిగెల రవి, మొకెనపల్లి బాలకృష్ణ, సల్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ నగర్‌లో పల్స్ పోలియో కార్యక్రమం

నూతన కమిటీ హాల్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన వైద్య సిబ్బంది

ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్



సూరారం డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన కమిటీ హాల్‌లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్లలోపు చిన్నారులకు వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు.చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించేందుకు ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీజ, స్టాఫ్ నర్స్ సుచరితతో పాటు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నూరా బషీరుద్దీన్, ప్రధాన కార్యదర్శి నాగరాజు చారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి వైద్య సిబ్బందికి, ప్రజలకు మధ్య సమన్వయం అవసరమని తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కాలనీ వాసులు సహకరించాలని కోరారు.



నిండు జీవితానికి రెండు చుక్కలు

తెల్లాపూర్ లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపి రఘునందన్ రావు

పటాన్ చెరువు ప్రజావాయిస్

పోలియో రహిత భారతదేశాన్ని నిర్మిద్దామని ప్రతి ఒక్క చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు దేశ వ్యాప్త పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం తెల్లాపూర్ పరిధిలోని ఇందిరానగర్ లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో స్థానిక మెదక్ ఎంపీ రఘునందన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి విధిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన కోరారు. పోలియో రహిత దేశంగా మార్చడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని అన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఐదేళ్ల లోపు చిన్నారులకు విధిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు ఈ ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బంది బిజెపి నాయకులు కార్యకర్తలు వివిధ కాలనీలకు చెందిన ప్రజలు స్థానికులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండు చుక్కల నిర్లక్ష్యం-జీవితకాలపు అంగవైకల్యం

తల్లిదండ్రుల అలసత్వం పసికందుల పాలిట శాపం కావద్దు

కిస్మత్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో పల్స్ పోలియో కార్యక్రమం

చిన్నారులకు పోలియో చుక్కలు వేసి అవగాహన కల్పించిన బీజేపీ నేత నిరుడు పవన్ సాయి

ప్రజావాయిస్॥రాజేంద్రనగర్:

మనం చేసే రెండు చుక్కల నిర్లక్ష్యం, అభం శుభం తెలియని పసికందులకు జీవితకాలపు అంగవైకల్యంగా మారుతుంది.తల్లిదండ్రుల అలసత్వం బిడ్డల భవిష్యత్తుకు శాపం కాకూడదని బీజేపీ నేత నిరుడు పవన్ సాయి అన్నారు.రాజేంద్రనగర్ సర్కిల్,బండ్లగూడ జాగీర్ పరిధిలోని కిస్మత్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఉదయం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం



ఆయన మాట్లాడుతూ...పోలియో రక్కసిని దేశం నుండి తరిమికొట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.గతంలో చుక్కలు వేయించాం కదా అని నిర్లక్ష్యం వహిస్తే మొదటికే మోసం వస్తుంది. అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 ఏళ్ల లోపు ఉన్న ప్రతి చిన్నారికి,గతంలో ఎన్నిసార్లు వేయించినా సరే,ఈసారి కూడా తప్పనిసరిగా రెండు చుక్కల అమృతాన్ని అందించాలని స్పష్టం చేశారు.అపోహలను నమ్మి బిడ్డల బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని తల్లిదండ్రులకు హితవు పలికారు.ఒక్క చిన్నారికి పోలియో చుక్కలు అందకపోయినా,యావత్ సమాజానికి ముప్పు పొంచి ఉన్నట్టేనని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఎండనక, వాననక ఇంటింటికీ తిరుగుతూ చిన్నారులకు రక్షణ కవచంలా పనిచేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది,ఆశా వర్కర్ల సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు,వైద్య సిబ్బంది, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అన్యాయం ఎక్కడ జరిగినా ముందుండే వ్యక్తి.. నేడు మంచానికే పరిమితం

- పదేళ్లుగా ఎలక్ట్రానిక్ మీడియాలో సేవలు..

- ప్రమాదంతో నిలిచిపోయిన సాగర్ యాదవ్ జీవితం

- ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, సేవా సంస్థలు ఆదుకోవాలంటున్న కుటుంబ సభ్యులు

ప్రజా వాయిస్ మంథని

అన్యాయం ఎక్కడ జరిగినా ప్రశ్నించే గొంతు.. ప్రజా సమస్య ఏదైనా తన వంతుగా స్పందించే వ్యక్తి.. దాదాపు పదేళ్లుగా ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తూ ప్రజలకు చేరువైన మిరియాల సాగర్ యాదవ్ జీవితం అనుకోని ప్రమాదంతో ఒక్కసారిగా మారిపోయింది. ప్రమాదంలో మెడ నరాలు, వెన్నుపూసకు తీవ్ర గాయాలు కావడంతో ప్రస్తుతం మంచానికే పరిమితమయ్యాడు. మంథని మున్సిపాలిటీ పరిధిలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా నివాసం ఉంటున్న సాగర్ యాదవ్ పలు ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు. వృత్తితో పాటు సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటూ ప్రజలకు



అందుబాటులో ఉండేవాడు. సమస్య ఉందని ఎవరైనా చెబితే స్పందించే వ్యక్తి నేడు తన సమస్యను తాను పరిష్కరించుకోలేని పరిస్థితిలో ఉండటం స్థానికులను కలచివేస్తోంది. నియోజకవర్గంలో నిత్యం ఎన్నో సభలు, సమావేశాలు, కార్యక్రమాలు జరుగుతున్నాయి. వివిధ వేడుకలకు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్న సందర్భాలూ ఉన్నాయి. కానీ అనుకోని ప్రమాదంతో జీవనాధారం కోల్పోయి మంచానికే పరిమితమైన సాగర్ యాదవ్ వంటి వ్యక్తికి అండగా నిలిచేందుకు ఎవరు ముందుకొస్తారన్న ప్రశ్న స్థానికంగా వినిపిస్తోంది.

ప్రభుత్వం స్పందించాలి.. దాతలు ముందుకు రావాలి

ఒకప్పుడు ప్రజల మధ్య తిరుగుతూ వార్తలు సేకరించిన వ్యక్తి నేడు నాలుగు గోడల మధ్య కాలం వెళ్లదీస్తుండటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించాలని, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, సేవా సంస్థలు, దాతలు మానవతా దృక్పథంతో ముందుకొచ్చి సాగర్ యాదవ్ కుటుంబానికి అండగా నిలవాలని కోరుతున్నారు.

ప్రజా వాయిస్ ప్రత్యేక విజ్ఞప్తి

ప్రజల సమస్యలను తన సమస్యగా భావించి పనిచేసిన సాగర్ యాదవ్‌కు (9912676670) కష్టకాలంలో సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉంది. ఒక కుటుంబానికి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, దాతలు స్పందించాలని ప్రజా వాయిస్ విజ్ఞప్తి చేస్తోంది.

బీరంగూడ గుట్టపై మారు మోగిన శరణు ఘోష

ఆధ్యాత్మిక వైభవం ఘనంగా అయ్యప్ప స్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం

వేలాదిగా తరలివచ్చిన అయ్యప్ప స్వాములు

తోగుట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన కార్యక్రమాలు

పాల్గొన్న ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఇతర నాయకులు

పటాన్ చెరువు ప్రజావాయిస్

భక్తి పారవశ్యం ఆధ్యాత్మిక పరిమళం అయ్యప్ప నామస్మరణతో బీరంగూడ గుట్ట పులకించిపోయింది. స్వామియే శరణమయ్యప్ప అంటూ వేలాది మంది అయ్యప్ప స్వాముల శరణుఘోషతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. భక్తజనుల కోలాహలం, వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ బీరంగూడ గుట్టపై ఆధ్యాత్మిక వైభవం వెల్లివిరిసింది.పటాన్చెరు నియోజకవర్గం బీరంగూడ డివిజన్ పరిధిలోని బీరంగూడ గుట్టపై నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి



ఆలయంలో పంచలోహ విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తోగుట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామివారి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆగమ శాస్త్రోక్తంగా ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగాయి. ఈ మహోన్నత కార్యక్రమానికి పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఎమ్మెల్సీ అంజిరెడ్డి అయ్యప్ప మాలాధారులు భక్తులు అయ్యప్ప స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అయ్యప్ప స్వామి భక్తి, క్రమశిక్షణ, నిష్ఠ, సమానత్వం, సేవాభావానికి ప్రతీక అని అన్నారు. అయ్యప్ప దీక్ష చేపట్టిన ప్రతి స్వామి 41 రోజుల పాటు నియమ నిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో ఆచరించే దీక్ష ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. స్వామియే శరణమయ్యప్ప అనే నినాదం మనలో భక్తిభావంతో పాటు సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తుందని తెలిపారు.బీరంగూడ గుట్టపై ఇంతటి పవిత్రమైన అయ్యప్ప స్వామి ఆలయం నిర్మించి, విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ ఆలయ అభివృద్ధికి తమ వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు ఈ పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములైన ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, అయ్యప్ప స్వాములు, భక్తులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పటాన్చెరువు నియోజకవర్గానికి చెందిన అయ్యప్ప స్వామి మాలదారులు అయ్యప్ప భక్తులు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు

బాలవికాస' స్వచ్ఛంద సంస్థ గ్రామానికి

మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరు

ముస్మిలో శుద్ధజల ప్లాంట్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

సర్పంచ్ బానోత్ దేవేందర్ దరఖాస్తు మేరకు

బాలవికాస నిధులు మంజూరు



ప్రజా వాయిస్ కొత్తగూడ

మండలంలోని ముస్మిగ్రామపంచాయతీ ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు 'బాలవికాస' స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది. గ్రామంలో సుమారు రూ. 2.80 లక్షల విలువైన, గంటకు 500 లీటర్ల సామర్థ్యం గల మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సంస్థ ఆమోదం తెలిపింది.గతంలో ముస్మి సర్పంచ్ బానోత్ దేవేందర్ చేసిన దరఖాస్తు మేరకు బాలవికాస ప్రతినిధులు గ్రామంలోని బోరు నీటిని సేకరించి నాణ్యతా పరీక్షలు నిర్వహించారు. ఆ నివేదిక ఆధారంగా, సంస్థ నియమ నిబంధనల ప్రకారం గ్రామంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్లాంట్ మంజూరు వివరాలను ప్రజలకు వెల్లడించారు. మొత్తం వ్యయంలో 80 శాతం నిధులను బాలవికాస సంస్థ సమకూరుస్తుండగా, మిగిలిన 20 శాతం (దాదాపు రూ. 60 వేలు) గ్రామస్థుల సభ్యత్వ రూపంలో సమకూర్చాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో బాలవికాస ప్రోగ్రాం మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బాల మోహన్ రెడ్డి, ఫీల్డ్ కోఆర్డినేటర్ విమల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం: సర్పంచ్ దేవేందర్

ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ దేవేందర్ మాట్లాడుతూ.. కలుషిత నీటి వల్ల ప్రజలు అనేక రకాల వ్యాధుల బారిన పడుతున్నారని, ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూత్రంతో ముందుజాగ్రత్త చర్యగా గ్రామస్థులందరికీ స్వచ్ఛమైన నీటిని అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తమ విన్నపానికి స్పందించి గ్రామానికి వాటర్ ప్లాంట్ మంజూరు చేసిన బాలవికాస సంస్థ అధికారులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ముస్మి గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరు

ముస్మి గ్రామ ప్రజల తాగునీటి కష్టాలను తీర్చేందుకు సర్పంచ్ బానోత్ దేవేందర్ ప్రత్యేక చొరవతో 'బాలవికాస' స్వచ్ఛంద సంస్థ గ్రామానికి మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంజూరు చేసింది.గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో బాలవికాస ప్రతినిధులు ప్లాంట్ ఏర్పాటు వివరాలను గ్రామస్తులకు వివరించారు.గంటకు 500 లీటర్ల సామర్థ్యం గల ఈ ప్లాంట్ మొత్తం విలువ సుమారు రూ. 2 లక్షల 80 వేలు.నిధుల కేటాయింపు: ఇందులో 80% నిధులను బాలవికాస సంస్థ సమకూరుస్తుండగా, మిగిలిన 20% వాటాగా (సుమారు రూ. 60 వేలు) గ్రామస్తులు సభ్యత్వం రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధుల నుండి ప్రజలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని సర్పంచ్ బానోత్ దేవేందర్ పేర్కొన్నారు. గ్రామస్తులందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని చెబుతూ, ప్లాంట్ మంజూరు చేసిన బాలవికాస అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బాలవికాస ప్రోగ్రాం మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బాల మోహన్ రెడ్డి, ఫీల్డ్ కోఆర్డినేటర్ విమల్ మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనతో శ్రీకృష్ణ నగర్‌ను అభివృద్ధి చేశాం

భవిష్యత్తులో మరిన్ని నిధులతో మరింత అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

శ్రీకృష్ణ నగర్‌లో నూతన కమ్యూనిటీ హాల్ ప్రారంభం



ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్: 129వ సూరారం డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణ నగర్‌లో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2014కు ముందు ఉన్న శ్రీకృష్ణ నగర్‌కు, నేటి శ్రీకృష్ణ నగర్‌కు అభివృద్ధి పరంగా ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన మొదటి రోజు నుంచే శ్రీకృష్ణ నగర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి కోట్లాది రూపాయల నిధులతో మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టి కాలనీ రూపురేఖలు మార్చామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయించి శ్రీకృష్ణ నగర్‌ను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.కాలనీలో చేపట్టిన అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు చిల్లర రాజకీయాలకు పాల్పడుతూ ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజలంతా ఐకమత్యంతో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, రాజకీయాలకు అతీతంగా కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో వరుసగా మూడోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించిన కుత్బుల్లాపూర్ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని వివేకానంద్ తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి సిద్ధిక్, కాలనీ అధ్యక్షుడు బషీరుద్దీన్, ప్రధాన కార్యదర్శి నాగరాజు చారి,మాజీ అధ్యక్షులు ధారం శివా గుప్తా, కోశాధికారి ఖళీం, కమిటీ సభ్యులు సంధ్యారాణి, శోభా,లక్ష్మణ్, రవీందర్ రెడ్డి, సాయి,శ్రీనివాస్,ప్రభాకర్,అబ్బాస్, మాణిక్యం, త్రినాథ్ రావు, మహిళా అధ్యక్షురాలు హేమలత రెడ్డి, సీనియర్ నాయకులు వారాల వినోద్, మధుమోహన్, ఫిరోజ్, కొండకళ్ళ శ్రీనివాస్ రెడ్డి, కోల శ్రీకాంత్ ముదిరాజ్, సాజిద్, సుధాకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



యాదవుల ఆత్మగౌరవానికి ప్రతీకగా సదర్ ఉత్సవాలు

- ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, మాజీ మంత్రి కృష్ణ యాదవ్ హాజరు

- సంస్కృతి, సాంప్రదాయాల వైభవాన్ని చాటి చెప్పిన ఉత్సవాలు

ప్రజా వాయిస్/తాండూరు:

తాండూరు పట్టణంలో శ్రీకృష్ణ యాదవ వెల్ఫేర్ అసోసియేషన్ సదర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలను యాదవ సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొని యాదవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. సదర్ ఉత్సవాలు యాదవుల ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు.మాజీ మంత్రి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ పశు సంపదను గౌరవించడం, దున్నపోతులను పూజించడం యాదవుల గొప్ప సంప్రదాయమని, వాటిని భావితరాలకు అందించాలని అన్నారు. మాజీ లైబ్రరీ సంస్థ చైర్మన్ రాజు గౌడ్, కంజర్ల విజయలక్ష్మి యాదవ్ సైతం యాదవుల వారసత్వ సంస్కృతిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, కౌన్సిలర్లు, కమిటీ అధ్యక్షులు మల్లేశం యాదవ్, ఉపాధ్యక్షులు అనంతయ్య యాదవ్, కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, సహాయ కార్యదర్శి సత్యయ్య యాదవ్, కోశాధికారి గోపాలకృష్ణ యాదవ్, మాజీ కోశాధికారి లాలప్ప యాదవ్ తదితరులు పాల్గొన్నారు. యాదవ సోదరులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సదర్ ఉత్సవాలను విజయవంతం చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

విద్యార్థులపై ఫీజుల భారం మోపడం సరికాదు.. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం: పుప్పాల భాస్కర్

ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్

ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సిఎంసీ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో ఆ భారాన్ని విద్యార్థులపై మోపుతూ ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేయడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నమ్ముకుని ఉన్నత విద్యను అభ్యసించిన విద్యార్థులు ఇప్పుడు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని తెలిపారు. ఎంతో కష్టపడి చదువులు పూర్తి చేసి వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు సాధించినప్పటికీ, కళాశాల యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉద్యోగాల్లో చేరలేని పరిస్థితి నెలకొందని అన్నారు.ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు అందలేదనే కారణంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేయడం, పెండింగ్ ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఫీజులు చెల్లిస్తే, భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చిన తర్వాత ఆ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని కళాశాలలు చెప్పడం సమంజసం కాదని ప్రశ్నించారు.ప్రభుత్వం, కళాశాలల మధ్య ఉన్న ఆర్థిక సమస్యలకు విద్యార్థులను బాధ్యులను చేయడం అన్యాయమని భాస్కర్ అన్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో చదువులు కొనసాగిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలపై వేలాది, లక్షల రూపాయల అదనపు భారం మోపడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు నాణ్యమైన విద్య, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెబుతూ మరోవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన పలు డిమాండ్లు చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఫీజుల పేరుతో విద్యార్థులపై కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజు బకాయిల కారణంగా విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు నిలిపివేయకుండా చూడాలని, ఉన్నత విద్య పూర్తి చేసి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సర్టిఫికెట్లు అందించాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని



సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.విద్యార్థుల చదువు, భవిష్యత్తు, ఉపాధి అవకాశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని భాస్కర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ బాధ్యతను విద్యార్థులపైకి నెట్టకుండా తక్షణమే స్పందించి పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కీర్తి గోపి వివాహ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

నూతన వధూవరులను ఆశీర్వదించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి

ప్రజా వాయిస్,మోతె:

సూర్యాపేట జిల్లా మోతే మండలంలోని సిరికొండ గ్రామ యూత్ కాంగ్రెస్ నాయకుడు కీర్తి గోపి వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు బొర్రా వెంకటేష్, కోల లింగయ్య గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెలుగు వీరన్నతో పాటు వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.



నీటి చుక్కకు.. యుద్ధం తప్పదా.?

ప్రకృతి ప్రసాదించిన జీవజలం.. వ్యాపార వస్తువుగా మారుతున్న వైనం

కనుమరుగవుతున్న చెరువులు..

అడుగంటుతున్న భూగర్భ జలాలు

వందల అడుగుల బోర్లు వేసినా

అందని జలధారలు

బాటిల్ నీటికీ తప్పని కొనుగోలు భారం..

పేదలకు పెనుభారం

ఇప్పటికైనా మేల్కొనకుంటే భావితరాలకు మిగిలేది ఎడారేనా.?

ప్రజా వాయిస్,ప్రత్యేక కథనం:

ప్రకృతి మనిషికి ఉచితంగా అందించిన అమూల్యమైన సంపద నీరు. కానీ నేడు అదే నీటిని డబ్బు పెట్టి కొనుక్కుని తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు గలగల పారిన వాగులు, కళకళలాడిన చెరువులు, జీవనాధారంగా నిలిచిన బావులు కనుమరుగవుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. వందల అడుగుల లోతుకు బోర్లు వేసినా నీటి జాడ కనిపించడం లేదు. మరోవైపు పెరుగుతున్న జనాభా, పారిశ్రామిక అవసరాలు, పట్టణీకరణ నీటి వినియోగాన్ని మరింత పెంచుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే రేపటి తరాలకు స్వచ్ఛమైన నీరు అందుతుందా? నీటి చుక్క కోసం గ్రామాలు, ప్రాంతాలు, దేశాలు పరస్పరం పోరాడాల్సి వస్తుందా? అన్న ప్రశ్నలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఒకనాటి జలసిరులు.. నేటి ఎడారి బతుకులు

ఒకప్పుడు పల్లెల్లో బావులు, చెరువులు, కుంటలు, వాగులు సమృద్ధిగా ఉండేవి. వర్షాలు కురిస్తే చెరువులు నిండేవి. బావుల్లో నీరు ఉబికేది. రైతులకు సాగునీరు, పశువులకు తాగునీరు, ప్రజలకు జీవన భరోసా లభించేది. కానీ నేడు అభివృద్ధి పేరుతో చెరువుల ఆక్రమణలు, అడవుల నరికివేత, సహజ జలమార్గాల విధ్వంసం పెరిగాయి. వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గిపోయాయి. ఫలితంగా జలవనరులు క్రమంగా కనుమరుగవుతున్నాయి.

బోర్లు పెరిగినా.. నీటి జాడ కరువే

భూగర్భజలాలు అంతులేని సంపదలు కావు. వర్షపు నీరు భూమిలోకి ఇంకితేనే వాటి నిల్వలు పెరుగుతాయి. కానీ అవసరానికి మించి బోర్ల ద్వారా నీటిని తోడేస్తున్నాం. ఒకప్పుడు తక్కువ లోతులోనే నీరు లభించిన ప్రాంతాల్లో ఇప్పుడు వందల అడుగుల లోతుకు బోర్లు వేసినా ఫలితం కనిపించడం లేదు. ఒక బోరు ఎండితే మరో బోరు.. అది విఫలమైతే ఇంకో బోరు.. ఇలా అప్పులు చేసి మరీ భూమిని తవ్వుతున్న రైతులకు నిరాశే మిగులుతోంది. నీటిని తోడటం ఎంత సులభమో.. తిరిగి భూగర్భంలోకి నింపడం అంత సులభం కాదన్న విషయాన్ని గుర్తించాలి.

నీరు దొరికినా.. తాగేందుకు భరోసా ఏదీ.?

నీటి కొరతతోపాటు కలుషిత నీరు మరో సమస్యగా మారుతోంది. కొన్ని ప్రాంతాల్లో భూగర్భజలాల్లో ఫ్లోరైడ్, నైట్రేట్ వంటి పదార్థాలు అధికంగా ఉండటం, పారిశ్రామిక వ్యర్థాలు, మురుగునీరు కలవడం ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో ఫ్లోరైడ్ సమస్య ఇంకా ప్రజలను వేధిస్తోంది. నీరు అందించడం మాత్రమే కాదు.. అది సురక్షితమైనదో కాదో పరీక్షించి సరఫరా చేయడం కూడా ప్రభుత్వ బాధ్యత. డబ్బున్నవారు శుద్ధి యంత్రాలు, బాటిళ్ల నీరు కొనగలరు. మరి నిరుపేదల పరిస్థితి ఏమిటి? స్వచ్ఛమైన తాగునీరు ప్రతి పౌరుడి హక్కుగా మారాలి.

బాటిళ్లలో బందీ.. వ్యాపార వస్తువుగా జీవజలం

ఒకప్పుడు ఉచితంగా లభించిన నీరు నేడు బాటిళ్లలో బందీ అయి ధర పలుకుతోంది. అత్యవసర సమయాల్లో ప్యాకేజ్డ్ వాటర్ ఉపయోగకరమే అయినా, ప్రజా తాగునీటి వ్యవస్థలపై నమ్మకం తగ్గి కొనుగోలు చేసిన నీటిపైనే ఆధారపడాల్సి రావడం ఆందోళనకరం. నీటి వ్యాపార సంస్థలు ప్రకృతి వనరులను అతిగా వినియోగించకుండా నియంత్రణలు ఉండాలి. నీరు మార్కెట్‌లో వస్తువుగా అమ్ముడవుతున్నా.. దాని మూలం ప్రకృతేనన్న విషయాన్ని మరచిపోకూడదు.

అభివృద్ధి మాటున.. నీటి వినియోగం మాటేమిటి.?

సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. డేటా సెంటర్లు, భారీ పరిశ్రమలు, ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో నీటి వినియోగం పెరుగుతోంది. అభివృద్ధిని ఎవరూ వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. అయితే పరిశ్రమలు, భారీ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చే ముందు స్థానిక నీటి లభ్యత, ప్రజల అవసరాలు, పర్యావరణ ప్రభావాలను అంచనా వేయాలి. శుద్ధి చేసిన మురుగునీటిని తిరిగి వినియోగించడం, నీటి వృథాను అరికట్టడం తప్పనిసరి కావాలి.

నీటి కోసం యుద్ధాలు.. రాబోయే ప్రమాదమా.?

ఒకప్పుడు భూమి, అధికారం, సంపద కోసంయుద్ధాలు జరిగాయి. భవిష్యత్తులో నీటి కొరత కూడా ఘర్షణలకు కారణమయ్యే ప్రమాదం ఉంది. ఒకే నదిపై ఆధారపడిన రాష్ట్రాలు, దేశాల మధ్య నీటి పంపిణీ వివాదాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల నీటి వినియోగం దిగువ ప్రాంతాల ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. నీటి కొరత యుద్ధాలకు దారితీయకుండా న్యాయమైన పంపిణీ, పరస్పర సహకారం, శాస్త్రీయ ప్రణాళికలు అవసరం. నీరు విభేదాలకు కాదు.. ఐక్యతకు వారధిగా నిలవాలి.

చెరువులను బతికిస్తేనే.. భవిష్యత్తుకు భరోసా

నీటి సమస్యకు పరిష్కారం ప్రకృతి వనరుల పరిరక్షణలోనే ఉంది. చెరువుల ఆక్రమణలు తొలగించాలి. పూడిక తీసి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వాగులు, వంకల సహజ ప్రవాహాలను కాపాడాలి. ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలి. భూగర్భజలాల వినియోగంపై నియంత్రణ ఉండాలి. రైతులకు సూక్ష్మసేద్యం, తక్కువ నీటితో పండే పంటలపై ప్రోత్సాహం అందించాలి. పరిశ్రమలు నీటిని పొదుపుగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలతోపాటు ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలి.

నీటిని కాపాడితేనే.. మానవాళికి మనుగడ

మనిషి అంతరిక్షాన్ని జయిస్తున్నాడు. సాంకేతిక అద్భుతాలు సృష్టిస్తున్నాడు. కానీ తన మనుగడకు అవసరమైన నీటిని కాపాడుకోలేకపోతే ఆ అభివృద్ధికి అర్థం ఏమిటి? నేటి నిర్లక్ష్యం రేపటి తరాలకు శాపంగా మారకూడదు. ప్రకృతి మనకు అందించిన నీటి సంపదను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిదీ.నీటి యుద్ధాలు రావాలని ఎదురుచూడొద్దు.. అవి రాకుండా ఇప్పుడే మేల్కొందాం! చెరువులను కాపాడుకుందాం.. వర్షపు నీటిని ఒడిసిపట్టుకుందాం.. ప్రతి నీటి చుక్కను పొదుపు చేద్దాం. ఎందుకంటే నీరు ఉంటేనే జీవితం.. జీవితం ఉంటేనే భవిష్యత్తు

కోటియా నాయక్

భూక్యా కోదాడ



నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటన్ చెరువు ప్రజావాయిస్

నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆధ్యాత్మికతతో పాటు ప్రజల ఐక్యతకు దేవాలయాలు ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.బీరంగూడ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట రెయిన్బో మెడోస్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం నిర్మాణ పనులలో భాగంగా ఆదివారం చేపట్టిన స్లాబ్ పనులను ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం అమీన్పూర్ డివిజన్ పరిధిలోని బంధంకొమ్ము హనుమాన్ దేవాలయంలో గల ధ్వజ స్థంభం తొడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా దేవాలయాల నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. దేవాలయాలు కేవలం పూజా స్థలాలే కాకుండా ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు కృష్ణ, రాజు, బిజిలీ రాజ్, జగదీష్, శ్రీకాంత్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

నూతన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ప్రభుత్వ విప్

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :

పేద ప్రజలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు స్వప్న కాలనీతో పాటు ఓదెల మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే సంకల్పంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్, స్థానిక కౌన్సిలర్, మార్కెట్ చైర్మన్, ఓదెల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



శత జయంతి సందర్భంగా 100 మంది మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

ఆరుగురు ప్రతిభావంతులైన విద్యార్థులకు సైకిళ్ల అందజేత

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :

సేవా కార్యక్రమాలతో సమాజ అభ్యున్నతికి తోడ్పడాలనే లక్ష్యంతో శ్రీ మడిశెట్టి మల్లేశం శత జయంతి సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ సైనిక్‌పురి ఆధ్వర్యంలో ఆదివారం గర్రెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మంది నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు, ఆరుగురు ప్రతిభావంతులైన విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. మల్లేశం కుమారుడు రోటేరియన్ ఎం. శ్రీహరి, కోడలు, క్లబ్ అధ్యక్షురాలు రోటేరియన్ విజయలక్ష్మి మడిశెట్టి దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ గర్రెపల్లిలో ఇంతటి బృహత్తర సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని, నిరుపేద మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు విద్యార్థులను ప్రోత్సహించడం సంతోషకరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రోటరీ జిల్లా 3150 అసిస్టెంట్ గవర్నర్ రోటేరియన్ శారద ప్రక్కి, క్లబ్ కార్యదర్శి శ్రీకాంత్ చీపురుపల్లి, కోశాధికారి కల్నల్ పి. కామేష్, క్లబ్ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నైట్ డ్యూటీకి వెళ్లి వ్యక్తి అదృశ్యం.. ఒడిశా వాసి కోసం గాలింపు..

మిర్యాలగూడలో కలకలం రేపిన ఘటన

ఈ నెల 17న విధులకు వెళ్లి తిరిగిరాని వంట మేస్త్రి

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. వన్ టౌన్ సీఐ నాగభూషణం రావు

ప్రజా వాయిస్, మిర్యాలగూడ:



మిర్యాలగూడ పట్టణంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. సీఐ ఎం. నాగభూషణరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం జజాపూర్ జిల్లా నాలిపూర్ గ్రామానికి చెందిన చంద్రుద్దిన్ కుమారుడు షేక్ మీనా జుద్దిన్ (39) గత పది రోజుల క్రితం మిర్యాలగూడకు వచ్చి చింతపల్లి ఎక్స్‌రోడ్ సమీపంలోని ఖలీల్ భాయ్ దాబాలో వంట మేస్త్రిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 17వ తేదీన రాత్రి విధులకు హాజరైన అతను మరుసటి రోజు తెల్లవారుజామున సుమారు 3 గంటలకు తాను నివాసముండే గదికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి దాబాకు గానీ, తన గదికి గానీ చేరుకోలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతకడంతో పాటు బంధువులకు ఫోన్ చేసి ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. అదృశ్యమైన సమయంలో తెలుపు రంగు ఫుల్‌షర్ట్, బ్రౌన్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని, చామనఛాయ రంగు, సుమారు 5.5 అడుగుల ఎత్తు ఉంటాడని సీఐ తెలిపారు. ఈ మేరకు షేక్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కౌశిక్ రెడ్డి రాజీనామాకు సిద్ధమా...

- **పెన్షన్ విషయంలో కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణలను ఆధారాలతో బయటపెట్టిన ప్రణవ్**
- **ఎమ్మెల్యే తీరుపై లబ్ధిదారుల ఆగ్రహం..**
- **సంక్షేమ పథకాలపై బిఆర్ఎస్ తన అక్కసును వెళ్లగక్కుతుందని ఆగ్రహం**
- **చనిపోయిన వారికి కూడా పెన్షన్ ఇవ్వాలా కౌశిక్ రెడ్డి??**

ప్రజా వాయిస్, హుజురాబాద్ (నవంబర్ 22):

పేదలకు అందించే సంక్షేమ పథకాలపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపట్ల తీవ్రంగా ఖండించారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హుజురాబాద్ నియోజకవర్గానికి కొత్తగా 4,221 పెన్షన్ మంజూరు చేశామని అన్నారు. ఆదివారం రోజున హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి సొంత గ్రామం వీణవంక లో 28 కొత్త పెన్షన్ లు ఇచ్చామని లబ్ధిదారుల సమక్షంలో ఆధారాలతో బయటపెట్టారు.కౌశిక్ రెడ్డి మాట్లాడేవాన్ని బట్టేబాజ్ ముచ్చట్లే, నియోజకవర్గ వ్యాప్తంగా వితంతులకు 1980,వికలాంగులు 1133,గీత కార్మికులకు 553,చేనేత కార్మికులకు 145,ఒంటరి మహిళలకు 311 పెన్షన్ లను అందజేశామని అన్నారు.స్వయంగా కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యే పదవిలో ఉండి ఇవి పంచాడని ఇప్పుడు సిగ్గు లేకుండా ఒక్క



పెన్షన్ కూడా ఇవ్వలేదని అబద్ధపు మాటలు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మాటలు విని బుద్ధి తెచ్చుకో కౌశిక్ రెడ్డి..

మీడియా సమావేశంలో మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే,మాజీ మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ నియోజకవర్గానికి 6 వేల కొత్త పెన్షన్ మంజూరు అయ్యాయని వాటిని మీడియా ముఖంగా వెల్లడించారని ఆ వీడియో మీడియా ప్రతినిధులకు చూపించారు.ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలా అవగాహన రాహిత్యంగా మాట్లాడడం హుజురాబాద్ నియోజవర్గానికి పట్టిన శని అని,హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు హుజురాబాద్ కు పట్టిన శని ఎప్పుడు వదులుతుంద అని ఆలోచించుకుంటున్నారన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు పరుస్తున్నాం..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు పరుస్తున్నామని,స్వయంగా కౌశిక్ రెడ్డి వీణవంక మండలంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల గృహ ప్రవేశానికి హాజరయ్యారని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న పథకాలు ప్రజలకు అందుతుంటే బిఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు.రైతులకి రుణమాఫీ విషయంలో నియోజవర్గవ్యాప్తంగా 33,158 మంది రైతులకు 248.5 కోట్ల నిధులతో రుణమాఫీ జరిగింది అని అన్నారు.ధరల పెరుగుదల విషయంలో రేట్లు ఎవరు పెంచుతారో తెలివిలేని వ్యక్తి కౌశిక్ రెడ్డి అని గ్యాస్,గుడ్డు ధరలు ఎవరు పెంచుతారో తెలివిలేని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అని అన్నారు.

రేవంత్ రెడ్డితో పోల్చుకునే స్థాయి బిఆర్ఎస్ నాయకులకు లేదు..

కింది స్థాయి నుండి స్వయం కృషితో ఎదిగి,జడ్పీటీసీ స్థాయి నుండి,ఎమ్మెల్యేగా ఎమ్మెల్సీగా,ఎంపీగా,ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఎదిగిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని,తనతో పోల్చుకునే స్థాయి బిఆర్ఎస్ నాయకులకు లేదని,పులిని చూసి నక్క వాత పెట్టుకుంటే పులి కాదని అన్నారు. 2009 లో ప్రతిపక్షంలో ఉన్నా కూడా కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారనీ,కొడంగల్ ప్రాంతానికి ఐటీఐ కాలేజీ,కోస్గి బస్ డిపో లాంటి అనేక అభివృద్ధి పనులు చేశారనీ,సిరిసిల్ల ప్రాంతానికి చిన్నబాస్ కేటీఆర్ 2009 ఏం చేశాడో కౌశిక్ రెడ్డి చెప్పగలుగుతాడా అని ప్రశ్నించారు. అంబేద్కర్ చౌరస్తాలో ముక్కు నేలకు రాసి,రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పి,వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ప్రణవ్ డిమాండ్.. పెన్షన్ ల విషయంలో ఆధారాలు చూపిస్తే రాజీనామా చేస్తానని చెప్పిన కౌశిక్ రెడ్డి వెంటనే రాజీనామా చేసి అంబేద్కర్ చౌరస్తాలో ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని,ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలకి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆగ్రిగోల్డ్ బాధితుల నిరీక్షణకు తెర.. 'నస్పూర్' కేంద్రంగా న్యాయపోరాటానికి తొలి అడుగు!

ఈ నెల 25 నుంచి ఒరిజినల్ బాండ్ల ధృవీకరణకు సీఐడీ పచ్చజెండా

నిర్మల్ జిల్లా బాధితులకు మంచిర్యాల జిల్లా నస్పూర్ పీఎస్‌లో ప్రత్యేక కేంద్రం

అసలు బాండ్లు చూపిస్తే చాలు.. అప్పగించాల్సిన పనిలేదని ఎస్పీ డా. జి. జానకి షర్మిల భరోసా....

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి

రెక్కాడితే కానీ డొక్కాడని పేద, మధ్యతరగతి కుటుంబాలు తమ పిల్లల భవిష్యత్తు కోసం రూపాయి రూపాయి కూడబెట్టి ఆగ్రిగోల్డ్ సంస్థలో దాచుకుని, ఏళ్ల తరబడి కన్నీళ్లతో ఎదురుచూస్తున్న వేలాది మంది బాధితులకు ఎట్టకేలకు ఓ ఆశాకిరణం కనిపించింది. బాధితుల కష్టార్జితానికి న్యాయం చేసే దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,సీఐడీ (జ×ణ) ఆధ్వర్యంలో అసలు బాండ్లు మరియు నగదు రసీదుల ధృవీకరణ ప్రక్రియకు రంగం సిద్ధమైంది.ఈ నెల 25వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కేంద్రాల్లో ఈ ప్రక్రియ ప్రారంభం కానుండగా,నిర్మల్ జిల్లా బాధితుల కోసం మంచిర్యాల జిల్లా నస్పూర్ పోలీస్ స్టేషన్‌లో



ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల,ఐపీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.అసలు బాండ్లకు పూర్తి భద్రత.. చూపిస్తే చాలు!ధృవీకరణ పేరుతో తమ వద్ద ఉన్న అసలు బాండ్లను ఎక్కడ తీసేసుకుంటారోనని బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎస్పీ స్పష్టం చేశారు. అధికారులు కేవలం అసలు బాండ్లను పరిశీలించి తిరిగి బాధితులకే ఇచ్చేస్తారని,వాటిపై సంతకం చేసిన కలర్ జిరాక్స్ ప్రతులను మాత్రమే సమర్పించాల్సి ఉంటుందని భరోసా ఇచ్చారు.పత్రాలు సమర్పించిన వెంటనే అధికారిక రసీదు కూడా అందజేస్తారు.ఇవి తప్పనిసరి.లేదంటే ఇబ్బందే!పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నస్పూర్ పోలీస్ స్టేషన్‌లో ఈ ప్రక్రియ కొనసాగుతుంది.బాధితులు తమ వెంట ఈ కింది పత్రాలను తప్పనిసరిగా తీసుకెళ్లాలి డిపాజిటర్ జీవించి ఉంటే అసలు ఆగ్రిగోల్డ్ బాండ్/రసీదు, సంతకం చేసిన బాండ్ కలర్ జిరాక్స్,ఆధార్, పాన్ కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ (ఖాతా సంఖ్య, ×ఖీూజ కోడ్ స్పష్టంగా ఉండాలి),5 తాజా పాస్‌పోర్ట్ ఫొటో, బ్యాంకుకు లింక్ అయిన మొబైల్ నంబర్ (తెలిస్తే ఏజెంట్ వివరాలు).డిపాజిటర్ మరణించి ఉంటే నామినీ లేదా చట్టబద్ధ వారసులు మరణ ధృవీకరణ పత్రం,కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రంతో పాటు ఆధార్,పాన్,బ్యాంకు వివరాలు సమర్పించాలి.

మండలాల వారీగా కేటాయించిన తేదీలు ఇవే..

రద్దీని నివారించేందుకు నిర్మల్ జిల్లాలోని పలు మండలాలకు ప్రత్యేక తేదీలను.కేటాయించారు.బాధితులు ఆయా తేదీల్లో మాత్రమే హాజరుకావాలని ఎస్పీ సూచించారు:

కేంద్ర రాష్ట్రప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

సిపిఎం పార్టీ ప్రజా పోరాటాలకు ఆకర్షతులై సిపిఎం లోచేరికలు

ప్రజా వాయిస్,మహబూబాబాద్

పట్టణంలోని 24 వ వార్డు బట్టు అంజన్న నగర్ కాలనీ నుంచి సిపిఎం పార్టీ లో భారీ ఎత్తిన పార్టీలోకి చేరారు.సిపిఎం పార్టీ ప్రజా పోరాటాలకు ఆకర్షితులైన పట్టు అంజన్న నగర్ కాలనీకి చెందిన 20కుటుంబాలు సిపిఎం పార్టీ లో చేరారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్నపు సోమయ్య సిపిఎం ఖండువ కప్పి ఆహ్వానించారు.సిపిఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ సూర్నపు సోమయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలు ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడుతున్న సిపిఎం పార్టీకి ఆకర్షతులై సిపిఎం లో చేరారన్నారు.పెదప్రజలకు అండా ఎర్ర జండా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో పార్టీ 36వార్డుల్లో విస్తరణకు పార్టీ నాయకత్వం నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు.పట్టణంలో కోతుల.కుక్కలా పందుల బెడదా నుంచి ప్రజలను మున్సిపాలిటీ అధికారులు కాపాడాలనీ వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు..పట్టణంలో అర్హులైన వారికీ ఇందిరమ్మ ఇండ్లు 57సం.. రాలు దాటినవారికి ఓల్డేజీ పెన్షన్స్ ఇవ్వాలని మహిళలకు మహా లక్ష్మి పథకంలో 2500రూపాయల ఇవ్వాలని మరియు ప్రతి ఇంటి యజమాని చనిపోయాక ఐదు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ వచ్చేలా ప్రజల్లో అవగాహనా సాధస్సులు పెట్టి ప్రతి వక్కరికి లబ్ది పొందెల ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు..సిపిఎం పార్టీ మీద నమ్మకంతో పార్టీలోకి చేరిన వారికీ పార్టీ నాయకత్వం ఎప్పుడు అందుబాటులోకి ఉంటారని అన్నారు వారికీ ఏ సమస్యలు వచ్చిన పరిష్కరించాటానికి సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు... ప్రజలు సిపిఎం పార్టీలో చేరుతున్నారంటే ప్రభుత్వాల వైఫల్యాలు మరింత పెరిగాయని పేద ప్రజలకు సమస్యలు పెరుగుతున్నాయని పోరాటాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని ఆయన అన్నారు.అలాగే ప్రభుత్వ భూములలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇంటి నెంబర్లను జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు...ఈ కార్యక్రమం లో సిపిఎం పార్టీ టూ టౌన్ కార్యదర్శి సమ్మెట రాజమౌళి పట్టణ కమిటీ సభ్యులు బానోత్ వెంకన్న పార్టీ 24వ వార్డు బాద్యులు భూక్యా రాజేష్,పార్టీ నాయకులు సొట్ల యాకయ్య.పార్టీలో చేరినవారు ముద్దంగుల సురేందర్, మైదాం వీరన్న.గుగులోత్ బాలాజీ,సంపంగి సాయి,పెద్ది ఎల్లయ్య,వెంకటస్వామి,అలకుంట్ల అచ్చమ్మ, అలకుంట్ల సాయిలు, ధారంగుల ఎల్లయ్య,ముద్దంగుల లావణ్య,దుంప ఎల్లమ్మ,ముద్దంగుల నర్సమ్మ, ధారంగులవెంకటమ్మ, సంపంగి లక్ష్మి,అలకుంట్ల సమ్మయ్య, దారుణగుల సురేష్,గుంజ మారేష్,తదితరులు పాల్గున్నారు.



స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు

అకాల మరణం చెందిన గడ్డం శ్రీనివాస్ కుటుంబానికి రూ.30,000/- వేల ఆర్థిక సహాయం అందజేత

స్నేహబంధానికి నిజమైన అర్థం చాటిన 2005-2006 పదో తరగతి పూర్వ విద్యార్థులు

ప్రజావాయిస్, కీసర:

స్నేహితుని మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేస్తూ, మానవత్వాన్ని చాటుకున్న 2005–2006 పదవ తరగతి పూర్వ విద్యార్థులు. తమ తోటి స్నేహితుడు గడ్డం శ్రీనివాస్ అకాల మరణంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన పూర్వ విద్యార్థులు, ఆయన కుటుంబానికి అండగా నిలవాలనే సంకల్పంతో రూ.30,000/– రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.మేడ్చల్ జిల్లా భోగారం గ్రామానికి చెందిన గడ్డం శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న 2005–2006 పదవ తరగతి పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి, తమ స్నేహితుని కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్పునిచ్చి, మనోధైర్యం కల్పించారు. కుటుంబానికి తమ వంతుగా రూ.30,000/– ఆర్థిక సహాయం అందించి కష్టకాలంలో అండగా నిలిచారు.స్నేహితుని మరణం తమను తీవ్రంగా కలచివేసిందని, ఆయన కుటుంబం ఒంటరిగా భావించకుండా తామంతా అండగా ఉంటామని పూర్వ విద్యార్థులు తెలిపారు. స్నేహితుని జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, కుటుంబానికి అవసరమైన సమయంలో సహాయం చేయడం తమ బాధ్యతగా భావించామని పేర్కొన్నారు. స్నేహం అంటే కేవలం కలిసి చదువుకున్న రోజులు, కలిసి గడిపిన క్షణాలు మాత్రమే కాదు.. కష్టకాలంలో ఒకరికొకరు అండగా నిలవడం, బాధను పంచుకోవడం, ఆపదలో ఆదుకోవడమే నిజమైన స్నేహమని ఈ పూర్వ విద్యార్థులు తమ సేవాభావంతో చాటిచెప్పారు.అకాల మరణం చెందిన స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి, మానవత్వం,



స్నేహబంధం, సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలిచిన 2005–2006 పదో తరగతి పూర్వ విద్యార్థుల ప్రయత్నం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ఈ కార్యక్రమంలో పడమటి రాజిరెడ్డి, కిషోర్ ముదిరాజ్, పవన్, నరేష్ యాదవ్,భాను,ఉపేందర్, నాగిరెడ్డి,మహేష్ తదితరులు పాల్గొన్నారు.....

సాహితీ ప్రస్థానంలో సరికొత్త శిఖరం

25వ పుస్తకంతో.. మరో మైలురాయి
'వెన్నెల కుప్పలు'తో పాఠకుల ముందుకు బెల్లంకొండ శ్రీరాములు
ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల చేతుల మీదుగా కవితా సంపుటి ఆవిష్కరణ

ప్రజావాయిస్,పెన్‌పహాడ్ :
అక్షరమే ఆయుధంగా.. సాహిత్యమే శ్వాసగా సాగుతున్న రచనా ప్రయాణంలో బెల్లంకొండ శ్రీరాములు మరో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. కవిగా, నవలా రచయితగా తనదైన ముద్ర వేస్తున్న గాజులమొల్కపురం వాసి శ్రీరాములు రచించిన 25వ పుస్తకం 'వెన్నెల కుప్పలు' కవితా సంపుటి ఘనంగా ఆవిష్కృతమైంది. చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలోని హైస్కూల్ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ మంత్రిప్రగడ హనుమంతరావు (ఐఏఎస్), సూర్యాపేట జిల్లా ఎస్పీ కే. నరసింహ (ఐపీఎస్) ముఖ్య అతిథులుగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు.

25 పుస్తకాల ప్రస్థానం..
కవిత్వం, నవలల రచనతో సాహితీ రంగంలో నిరంతరం కృషి చేస్తున్న శ్రీరాములు 25వ పుస్తకాన్ని వెలువరించడం విశేషంగా నిలిచింది. సాహిత్యంతో పాటు రాజకీయ రంగంలోనూ కొనసాగుతున్న ఆయన ప్రస్తుతం సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒకవైపు రచనా వ్యాసంగం.. మరోవైపు రాజకీయ బాధ్యతలతో తనదైన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

ప్రముఖుల అభినందనలు..
ఈ సందర్భంగా రచయితను గ్రామ సర్పంచ్ వటికూటి నాగయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు,



సాహిత్యాభిమానులు అభినందించారు. తన రచనను ఆదరించి, ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులందరికీ బెల్లంకొండ శ్రీరాములు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 25వ పుస్తక ఆవిష్కరణతో సాహితీ ప్రస్థానంలో మరో అడుగు ముందుకేసిన ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు



రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి రూ.కోటి బీమా చెక్కు అందజేత

బెల్లంపల్లి, / ప్రజా వాయిస్
రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సింగరేణి కార్మికుడి కుటుంబానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అండగా నిలిచింది. బ్యాంకులో జీతం ఖాతా కలిగి ఉండటంతో ప్రమాద బీమా కింద మృతుడి భార్యకు రూ.కోటి బీమా చెక్కును అందజేసింది, బెల్లంపల్లి పట్టణంలోని హనుమాన్ బస్తీకి చెందిన సింగరేణి కార్మికుడు పోసిని వెంకటస్వామి (45) గత మార్చి 23న బొక్కలగుట్ట రాళ్లవాగు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన కె.కె.-5 గనిలో విధులు నిర్వహించేవారు. బెల్లంపల్లి యూనియన్ బ్యాంకులో వెంకటస్వామికి జీతం ఖాతా ఉండటంతో, బీమా నిబంధనల ప్రకారం నామినీగా ఉన్న ఆయన భార్య సుమలతకు రూ.కోటి బీమా చెక్కును అందజేశారు.యూనియన్ బ్యాంకులో నిర్వహించిన కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ చందన్ కుమార్, సీనియర్ మేనేజర్ తరుణ్ సింగ్, ఆర్డీవో విజయ్ సంజయ్ చేతుల మీదుగా చెక్కును బాధిత కుటుంబానికి అందించారు.

బాలవికాస' స్వచ్ఛంద సంస్థ గ్రామానికి మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరు

ముస్మిలో శుద్ధజల ప్లాంట్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
సర్పంచ్ బానోత్ దేవేందర్ దరఖాస్తు మేరకు
బాలవికాస నిధులు మంజూరు

ప్రజా వాయిస్ కొత్తగూడ
మండలంలోని ముస్మిగ్రామపంచాయతీ ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు 'బాలవికాస' స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది. గ్రామంలో సుమారు రూ. 2.80 లక్షల విలువైన, గంటకు 500 లీటర్ల సామర్థ్యం గల మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సంస్థ ఆమోదం తెలిపింది.గతంలో ముస్మి సర్పంచ్ బానోత్ దేవేందర్ చేసిన దరఖాస్తు మేరకు బాలవికాస ప్రతినిధులు గ్రామంలోని బోరు నీటిని సేకరించి నాణ్యతా పరీక్షలు నిర్వహించారు. ఆ నివేదిక ఆధారంగా, సంస్థ నియమ నిబంధనల ప్రకారం గ్రామంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్లాంట్ మంజూరు వివరాలను ప్రజలకు వెల్లడించారు. మొత్తం వ్యయంలో 80 శాతం నిధులను బాలవికాస సంస్థ సమకూరుస్తుండగా, మిగిలిన 20 శాతం (దాదాపు రూ. 60 వేలు) గ్రామస్థుల సభ్యత్వ రూపంలో సమకూర్చాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో బాలవికాస ప్రోగ్రాం మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ప్రాజెక్ట్



కోఆర్డినేటర్ బాల మోహన్ రెడ్డి, ఫీల్డ్ కోఆర్డినేటర్ విమల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం: సర్పంచ్ దేవేందర్
ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ దేవేందర్ మాట్లాడుతూ.. కలుషిత నీటి వల్ల ప్రజలు అనేక రకాల వ్యాధుల బారిన పడుతున్నారని, ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూత్రంతో ముందుజాగ్రత్త చర్యగా గ్రామస్థులందరికీ స్వచ్ఛమైన నీటిని అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తమ విన్నపానికి స్పందించి గ్రామానికి వాటర్ ప్లాంట్ మంజూరు చేసిన బాలవికాస సంస్థ అధికారులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ముస్మి గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరు.

ముస్మి గ్రామ ప్రజల తాగునీటి కష్టాలను తీర్చేందుకు సర్పంచ్ బానోత్ దేవేందర్ ప్రత్యేక చొరవతో 'బాలవికాస' స్వచ్ఛంద సంస్థ గ్రామానికి మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంజూరు చేసింది.గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో బాలవికాస ప్రతినిధులు ప్లాంట్ ఏర్పాటు వివరాలను గ్రామస్తులకు వివరించారు.గంటకు 500 లీటర్ల సామర్థ్యం గల ఈ ప్లాంట్ మొత్తం విలువ సుమారు రూ. 2 లక్షల 80 వేలు.
నిధుల కేటాయింపు: ఇందులో 80% నిధులను బాలవికాస సంస్థ సమకూరుస్తుండగా, మిగిలిన 20% వాటాగా (సుమారు రూ. 60 వేలు) గ్రామస్తులు సభ్యత్వం రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధుల నుండి ప్రజలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని సర్పంచ్ బానోత్ దేవేందర్ పేర్కొన్నారు. గ్రామస్తులందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని చెబుతూ, ప్లాంట్ మంజూరు చేసిన బాలవికాస అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బాలవికాస ప్రోగ్రాం మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బాల మోహన్ రెడ్డి, ఫీల్డ్ కోఆర్డినేటర్ విమల్ మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భారతీనగర్ డివిజన్‌లో పల్స్ పోలియో

పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

పటన్ చెరువు ప్రజావాయిస్
భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి LIG కాలనీ బాంబే కాలనీలలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పల్స్ పోలియో కార్యక్రమం అమలులో ఎదురైన లోపాల కారణంగా కొందరు చిన్నారులు పోలియో బారిన పడిన ఘటనలు ఆందోళన కలిగించాయని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు అందేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ఏ ఒక్క చిన్నారిని కూడా ఈ పల్స్ పోలియో కార్యక్రమం నుంచి మినహాయించకూడదని అన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో బస్తీ దవాఖాన వైద్యులు డాక్టర్ ఆశు తోష్, సిస్టర్ సారా, LIG కాలనీ అధ్యక్షుడు యాదగిరి రెడ్డి, BRS సీనియర్ నాయకులు పాటి సత్యనారాయణ, దీ=నా మాజీ మైనారిటీ సర్కిల్ ఉపాధ్యక్షుడు ఘౌస్ భాయ్, సర్కిల్ యువజన మాజీ అధ్యక్షుడు నరసింహ, సతీష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో కీసరగుట్టకు కిటకిట

స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు
శివలింగాల వద్ద కార్తీక దీపాలు వెలిగించి భక్తులు,
కుటుంబ సమేతంగా శ్రీరామలింగేశ్వర స్వామివారిని దర్శించుకున్న
ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్ రావు

ప్రజావాయిస్, కీసర :
మేడ్చల్ జిల్లా కీసర లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం లోపల, వెలుపల ఉన్న శివలింగాల వద్ద కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

స్వామివారి సేవలో ఆర్టీఐ కమిషనర్...
ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్ రావు కుటుంబ సమేతంగా కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి విచ్చేసి స్వామివారి అభిషేకంలో



పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం వెంకటేశ్వర్లు, ఈవో కట్ట సుధాకర్ రెడ్డి, ఆలయ అర్చకులు, ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు నారాయణ శర్మ, నాగలింగం శర్మ తదితరులు పాల్గొన్నారు.

కీసరలో భారీ ట్రాఫిక్.. రోడ్డు విస్తరణకు ప్రజల డిమాండ్
ఆదివారం భక్తుల రద్దీతో కీసర పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు భారీగా పెరిగాయి. దీంతో కీసర ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు



తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.ప్రతి ఆదివారం, పండుగలు, ప్రత్యేక రోజుల్లో కీసరగుట్టకు భక్తుల రాక పెరుగుతున్న నేపథ్యంలో రహదారిని విస్తరించి, ట్రాఫిక్ నియంత్రణకు శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు. కీసరలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేలా రోడ్డు విస్తరణ చేపట్టాలని, వాహనాల రద్దీకి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆరెల్లి మైసమ్మ కృపతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

భైంసా కిసాన్ గల్లీలో ఘనంగా విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం
ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి

నిర్మల్ జిల్లా ప్రజా వాయిస్ ప్రతినిధి
భైంసా పట్టణంలోని కిసాన్ గల్లీలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.స్థానికంగా నూతనంగా గద్దె నిర్మాణం చేపట్టి,ఆరెల్లి మైసమ్మ తల్లి ఆలయం మరియు రాజుల వారి దేవాలయంలో నిర్వహించిన విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ముధోల్ నియోజకవర్గ శాసనసభ్యుడు పవార్ రామారావు పటేల్ మరియు భైంసా మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి హాజరయ్యారు.ప్రజల శ్రేయస్సు కోసం ప్రత్యేక పూజలు ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్,మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రిలకు ఆలయ కమిటీ సభ్యులు,స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు.అనంతరం వారు ఆరెల్లి మైసమ్మ అమ్మవారికి, రాజుల వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,అమ్మవారి దీవెనలు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని. భైంసా పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, కిసాన్ గల్లీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రజల మధ్యే ప్రయాణం..నిత్యం కార్యక్రమాలతో బిజీబిజీ..

- **కార్తీక మాసం ఆరంభం నుంచిది విరామం లేని పర్యటనలు..**
- **పది రోజుల వ్యవధిలోనే వందకు పైగా కార్యక్రమాలకు హాజరు..**
- **ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేకంగా చర్చ..**
- **కోడికూయక ముందే మొదలయ్యే ప్రయాణం.. అర్ధరాత్రి వరకు కొనసాగే కార్యక్రమాలు**
- **నాయకుడిగా మాత్రమే కాదు.. కుటుంబ సభ్యుడిగా**
- **ఆత్మీయతను పంచుకుంటూ ముందుకు సాగుతున్న రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**

ప్రజా వాయిస్ రామగుండం
రాజకీయాల్లో పదవులు మారినా ప్రజలతో అనుబంధం కొనసాగించడమే నాయకుడికి అసలైన గుర్తింపు. ఈ దిశగా రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కోరుకంటి చందర్ నిరంతర పర్యటనలతో ప్రజల్లో కనిపిస్తున్నారు. కార్తీక మాసం ప్రారంభమైన నాటి నుంచి వరుస కార్యక్రమాలతో ఆయన బిజీగా గడుపుతున్నారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సామాజిక, రాజకీయ, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు వివాహ వేడుకలకు హాజరవుతూ ప్రజలతో మమేకమవుతున్నారు. ఉదయం ప్రారంభమయ్యే పర్యటనలు రాత్రి వరకు కొనసాగుతుండటం ఆయన రోజువారీ కార్యక్రమాల తీరును తెలియజేస్తోంది. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం కార్తీక మాసం ఆరంభం నుంచి ఇప్పటివరకు సుమారు వందకు పైగా కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఒకవైపు పార్టీ కార్యక్రమాలు, మరోవైపు ప్రజల వ్యక్తిగత శుభకార్యాలకు హాజరవుతూ



విభిన్న వర్గాల వారితో సంబంధాలను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం గోదావరిఖని, పెద్దపల్లి పట్టణాల్లో జరిగిన పలు వివాహ వేడుకలకు చందర్ హాజరయ్యారు. గోదావరిఖనిలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో డాక్టర్ కొండా రమేష్ కుమార్తె నవ్యశ్రీ, అక్షయ్ కుమార్‌ల వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. క్లాసిక్ గార్డెన్‌లో జరిగిన పిట్టల మహేష్, శశిప్రియ వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెద్దపల్లిలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో జరిగిన సాయి ప్రియ, నిఖిల్ రెడ్డి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకల్లో కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరిస్తూ వారి సంతోషాల్లో భాగస్వాములయ్యారు. రాజకీయ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజల కుటుంబ వేడుకలకు సైతం ప్రాధాన్యత ఇస్తుండటం ఆయన పర్యటనల్లో కనిపిస్తున్న అంశం. పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజలతో సంబంధాలు కొనసాగించడం రాజకీయ నాయకులకు కీలకమనే అభిప్రాయం ఉంది. ఆ కోణంలో చందర్ నిరంతర పర్యటనలు, వరుస కార్యక్రమాల్లో ఆయన భాగస్వామ్యం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తోంది. ప్రజల మధ్య ఉంటూ వారి ఆహ్వానాలకు స్పందించడం ద్వారా తన రాజకీయ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు.



వైభవంగా శ్రీ కంఠమహేశ్వర స్వామి బోనాల మహోత్సవం

మహోత్సవంలో పాల్గొన్న కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయంలో బోనాల మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు పాలకుర్ల యాదయ్య గౌడ్ మరియు దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ఘనంగా బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ వేడుకలకు రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి, బోనాల ఉత్సవాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ మహోత్సవంలో స్థానిక అయ్యప్ప స్వాములు, గౌడ సంఘం నాయకులు, కుల బంధువులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆకాంక్ష విద్యార్థి ఎంపిక

ప్రజా వాయిస్ : హాలియా : నవంబర్ 22



హాలియా మున్సిపాలిటీలోని ఆకాంక్ష పాఠశాల విద్యార్థి 70 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న హాలియాలో జరిగిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి అండర్ – 14 కబడ్డీ పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ఉమ్మడి నల్గొండ జిల్లా కబడ్డీ జట్టుకి కెప్టెన్ గా ఆర్.యోగేందర్ నాయక్ ఎన్నికయ్యాడు.ఈనెల 22 నుండి 24 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా తొర్రూర్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆ విద్యార్థి పాల్గొంటున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోదాల రవీందర్ తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన యోగేందర్ నాయక్ ను పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్ రావు, డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, వైస్ ప్రిన్సిపల్ ఎండి కరీం, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆవుల చంద్రశేఖర్ యాదవ్ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించారు.



పుట్టిన ఊరికి సేవ చేయడమే నిజమైన సుకృతం

దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతురావు

బేతవోలు బాలికలకు లక్ష రూపాయల సైకిళ్ల పంపిణీ

ప్రజా వాయిస్, చిలుకూరు, నవంబర్ 22 :

పుట్టిన ఊరికి సేవ చేయడం పూర్వజన్మ సుకృతమని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ మంత్రిప్రగడ హనుమంతరావు అన్నారు.చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తన కుటుంబ సభ్యుల సహకారంతో సుమారు లక్ష రూపాయల విలువైన సైకిళ్లను పాఠశాల బాలికలకు పంపిణీ చేశారు. దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే బాలికలకు రాకపోకలు సులభతరం కావాలనే ఉద్దేశంతో ఈ సైకిళ్లను అందజేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ, తాను ఏ స్థాయిలో ఉన్నా, ఏ పదవిలో ఉన్నా పుట్టి పెరిగిన ఊరిని, కన్న తల్లిదండ్రులను, చిన్ననాటి జ్ఞాపకాలను ఎన్నటికీ మరచిపోలేనన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన ప్రతి ఒక్కరూ తమ సొంత గ్రామ అభివృద్ధికి, పేద విద్యార్థుల సంక్షేమానికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. విద్యార్థినులు విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ, ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామ సేవలో చెరగని ముద్ర..
ప్రతాప్ రెడ్డికి ఘన నివాళి

మహోన్నత సేవకుడిని కోల్పోయాం..

సంస్మరణ సభలో గ్రామస్తుల భావోద్వేగం తిమ్మాపూర్ అభివృద్ధి ప్రదాత

ప్రతాప్ రెడ్డి.. ప్రథమ వర్ధంతి సంస్మరణ సభ ఘనంగా నిర్వహణ

ప్రజావాయిస్ / బొమ్మలరామారం

బొమ్మలరామారం మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం మూగల కుటుంబ సభ్యులు మూగల ప్రతాప్ రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించి, స్మారక సృతి జీవిత పుస్తకం ఆవిష్కరించారు.అనంతరం గ్రామ ప్రజలు మాట్లాడుతూ ప్రతాప్ రెడ్డి గ్రామానికి చేసిన సేవలను గురించి కొనియాడారు. ప్రతాప్ రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామంలో రామాలయం, గ్రామదేవతల దేవాలయాల నిర్మాణం జరిగిందని తెలిపారు. అలాగే పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, పాఠశాల తరగతి గదుల నిర్మాణము ఇవే కాకుండా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేశారని తెలిపారు. పేదింటి ఆడపడుచుల వివాహాలకు తాళిబొట్టుడు కానుకలుగా అందించి వారికి ఆర్థికంగా అండగా నిలిచారని తెలిపారు. గ్రామానికి ఎన్నో సేవలందించిన మహోన్నత వ్యక్తిని కోల్పోవడం గ్రామ ప్రజల దురదృష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రి ప్రతాప్ రెడ్డి తనయులు రఘునందన్ రెడ్డి, నాగిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తండ్రి చూపిన బాటలోనైనాడుస్తూ గ్రామానికి వాళ్లు కూడా వాళ్ళ వంతు సేవలను అందిస్తున్నారని వారి కుటుంబ సభ్యులందరికీ గ్రామ ప్రజలు రుణపడి ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి , శతావధానులు మలుగ అంజయ్య యాదవ్ , బో రెడ్డి అయోధ్య రెడ్డి, సర్పంచ్ కృష్ణా నాయక్, ఉప సర్పంచ్ వెంకటేష్ వెంకటేష్ యాదవ్, మంగారెడ్డి , రుక్మాకర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్, మండలం ఫిషర్మెన్ కమిటీ అధ్యక్షులు కనకరాజు ప్రతాప్ రెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామ ప్రజలందరూ పాల్గొన్నారు.



ఇస్కాఫ్ జిల్లా, తాండూరు కమిటీల ఎన్నిక

- జిల్లా అధ్యక్షుడిగా బి. జనార్దన్ రెడ్డి..

- తాండూరు డివిజన్ అధ్యక్షుడిగా కరణం పురుషోత్తం

ప్రజావాయిస్/వికారాబాద్/తాండూరు:

భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కాఫ్) వికారాబాద్ జిల్లా, తాండూరు డివిజన్ కమిటీల ఎన్నికలు ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు సీనియర్ న్యాయవాది కడారు ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా అడ్వకేట్ బి. జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.ఏ. అలీము, కిషోర్, రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. తాండూరు డివిజన్ అధ్యక్షుడిగా కరణం పురుషోత్తం, ఉపాధ్యక్షులుగా లెక్చరర్ రాజశేఖర్, శ్రీనివాస్, మౌలానా, అడ్వకేట్ పాశం రవికుమార్ తదితరులు, ప్రధాన కార్యదర్శిగా ఎన్. సుదర్శన్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా కడారు ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. దేశ సంస్కృతి, సమైక్యత, సౌభ్రాతృత్వ పరిరక్షణే ఇస్కాఫ్ లక్ష్యమని, గత 85 ఏళ్లుగా మానవ హక్కులు, రాజ్యాంగ విలువల పరిరక్షణకు సంఘం కృషి చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యుద్ధాలు లేని శాంతియుత ప్రపంచ నిర్మాణమే తమ ఆశయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక అధ్యక్షుడు బలరాం, కేశవులు, మల్లేశం, పలువురు మేధావులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, లెక్చరర్లు, యువకులు పాల్గొన్నారు.





పేద మహిళలకు ఉపాధి పట్టం.!

101 కుట్టు మిషన్ల పంపిణీ

ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేత

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి..

స్వయం ఉపాధితో కుటుంబాలకు అండగా నిలవాలి

ఆర్య వైశ్య మహాసభ సేవలను అభినందించిన ఎమ్మెల్యే

ప్రజా వాయిస్,కోదాడ:

పేద మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో 101 మంది మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. కోదాడ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో సూర్యాపేట జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి తన చేతుల మీదుగా లబ్ధిదారులకు కుట్టు మిషన్లను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు కుట్టు పనిని ఉపాధిగా మలుచుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. స్వయం ఉపాధితో కుటుంబాలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. పేద మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఆర్య వైశ్య మహాసభ సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య మహాసభ ప్రతినిధులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



పోలియో రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింహారెడ్డి

పటాన్ చెరువు ప్రజావాయిస్

పోలియో రహిత సమాజాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రతి ఒక్కరు ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించల్లన్నారు.చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజాన్ని నిర్మించవచ్చ అని అన్నారు ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పిల్లల ఆరోగ్యమే దేశ భవిష్యత్తు అనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.రెండు చుక్కలు పోలియోకు చరమగీతం!పోలియో రహిత సమాజమే మన లక్ష్యంగా ప్రతి ఒక్కరు కలిసి కృషి చేయాలన్నారు ఈ కార్యక్రమంలో ముత్తంగి డివిజన్ వైద్య సిబ్బంది నాయకులు ప్రజలు యూవకులు గ్రామస్తులు పాల్గొన్నారు

చింతలమానేపల్లి నూతన ఎస్సైగా స్వరూప్ రాజ్ బాధ్యతల స్వీకరణ

ప్రజా వాయిస్. చింతల మానేపల్లి./కౌటాల.



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండల పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా స్వరూప్ రాజ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా విధుల్లో చేరారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని నూతన ఎస్సై తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామని, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ దందాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలపై నిఘా ఉంచుతామని తెలిపారు. మండల ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఏదైనా సమస్య ఎదురైతే భయపడకుండా పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, రహదారి భద్రతా నియమాలు పాటించాలని కోరారు. ప్రజలు, పోలీసుల మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ విధులు నిర్వహిస్తామని తెలిపారు. నూతన ఎస్సై స్వరూప్ రాజ్ బాధ్యతలు స్వీకరించడంతో మండల ప్రజలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

గ్రామ సేవలో చెరగని ముద్ర..
ప్రతాప్ రెడ్డికి ఘన నివాళి

మహోన్నత సేవకుడిని కోల్పోయాం..

సంస్మరణ సభలో గ్రామస్తుల భావోద్వేగం తిమ్మాపూర్ అభివృద్ధి ప్రదాత

ప్రతాప్ రెడ్డి.. ప్రథమ వర్ధంతి సంస్మరణ సభ ఘనంగా నిర్వహణ



ప్రజావాయిస్ / బొమ్మలరామారం

బొమ్మలరామారం మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం మూగల కుటుంబ సభ్యులు మూగల ప్రతాప్ రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించి, స్మారక సృతి జీవిత పుస్తకం ఆవిష్కరించారు.అనంతరం గ్రామ ప్రజలు మాట్లాడుతూ ప్రతాప్ రెడ్డి గ్రామానికి చేసిన సేవలను గురించి కొనియాడారు. ప్రతాప్ రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామంలో రామాలయం, గ్రామదేవతల దేవాలయాల నిర్మాణం జరిగిందని తెలిపారు. అలాగే పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, పాఠశాల తరగతి గదుల నిర్మాణము ఇవే కాకుండా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేశారని తెలిపారు. పేదింటి ఆడపడుచుల వివాహాలకు తాళిబొట్టుడు కానుకలుగా అందించి వారికి ఆర్థికంగా అండగా నిలిచారని తెలిపారు. గ్రామానికి ఎన్నో సేవలందించిన మహోన్నత వ్యక్తిని కోల్పోవడం గ్రామ ప్రజల దురదృష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రి ప్రతాప్ రెడ్డి తనయులు రఘునందన్ రెడ్డి, నాగిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తండ్రి చూపిన బాటలోనైనాడుస్తూ గ్రామానికి వాళ్లు కూడా వాళ్ళ వంతు సేవలను అందిస్తున్నారని వారి కుటుంబ సభ్యులందరికీ గ్రామ ప్రజలు రుణపడి ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి , శతావధానులు మలుగ అంజయ్య యాదవ్ , బో రెడ్డి అయోధ్య రెడ్డి, సర్పంచ్ కృష్ణా నాయక్, ఉప సర్పంచ్ వెంకటేష్ వెంకటేష్ యాదవ్, మంగారెడ్డి , రుక్మాకర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్, మండలం ఫిషర్మెన్ కమిటీ అధ్యక్షులు కనకరాజు ప్రతాప్ రెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామ ప్రజలందరూ పాల్గొన్నారు.

భక్తులతో కీసరగుట్టకు కిటకిట

స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు
శివలింగాల వద్ద కార్తీక దీపాలు వెలిగించి భక్తులు, కుటుంబ సమేతంగా శ్రీరామలింగేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్ రావు





ప్రజావాయిస్, కీసర :
మేడ్చల్ జిల్లా కీసర లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం లోపల, వెలుపల ఉన్న శివలింగాల వద్ద కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

స్వామివారి సేవలో ఆర్టీఐ కమిషనర్...
ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్ రావు కుటుంబ సమేతంగా కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి విచ్చేసి స్వామివారి అభిషేకంలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం వెంకటేశ్వర్లు, ఈవో కట్ట సుధాకర్ రెడ్డి, ఆలయ అర్చకులు, ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు నారాయణ శర్మ, నాగలింగం శర్మ తదితరులు పాల్గొన్నారు.

కీసరలో భారీ ట్రాఫిక్.. రోడ్డు విస్తరణకు ప్రజల డిమాండ్
ఆదివారం భక్తుల రద్దీతో కీసర పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు భారీగా పెరిగాయి. దీంతో కీసర ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.ప్రతి ఆదివారం, పండుగలు, ప్రత్యేక రోజుల్లో కీసరగుట్టకు భక్తుల రాక పెరుగుతున్న నేపథ్యంలో రహదారిని విస్తరించి, ట్రాఫిక్ నియంత్రణకు శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు. కీసరలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేలా రోడ్డు విస్తరణ చేపట్టాలని, వాహనాల రద్దీకి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్

ప్రజా వాయిస్ : హాలియా : నవంబర్ 22:
అనుముల మండలం పుల్లారెడ్డిగూడెం గ్రామ వాస్తవ్యులు జానపాటి బిక్షం యాదవ్–కోటమ్మ కుమారుడు లిలికేంధర్ యాదవ్–ఇందుమతిల ల వివాహానికి హాజరయ్యి నూతన దంపతులను ఆశీర్వధించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్.వారితోపాటు యాదవ సంఘం సీనియర్ నాయకులు జానపాటి బాలయ్య యాదవ్, పేరూరు దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ మనాది పురుషోత్తం, మన్నెం రంజిత్ యువసేన అధ్యక్షుడు కుంటిగొర్ల రాజశేఖర్, చెవుల యల్లయ్య, ముద్ద నవీన్ మరియు తదితరులు పాల్గొనడం జరిగింది..

ప్రజల మధ్యే ప్రయాణం.. నిత్యం కార్యక్రమాలతో బిజీబిజీ..

- కార్తీక మాసం ఆరంభం నుంచి విరామం లేని పర్యటనలు..
- పది రోజుల వ్యవధిలోనే వందకు పైగా కార్యక్రమాలకు హాజరు..
- ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేకంగా చర్చ..
- కోడికూయక ముందే మొదలయ్యే ప్రయాణం.. అర్ధరాత్రి వరకు కొనసాగే కార్యక్రమాలు
- నాయకుడిగా మాత్రమే కాదు.. కుటుంబ సభ్యుడిగా
- ఆత్మీయతను పంచుకుంటూ ముందుకు సాగుతున్న రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

ప్రజా వాయిస్ రామగుండం
రాజకీయాల్లో పదవులు మారినా ప్రజలతో అనుబంధం కొనసాగించడమే నాయకుడికి అసలైన గుర్తింపు. ఈ దిశగా రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కోరుకంటి చందర్ నిరంతర పర్యటనలతో ప్రజల్లో కనిపిస్తున్నారు. కార్తీక మాసం ప్రారంభమైన నాటి నుంచి వరుస కార్యక్రమాలతో ఆయన బిజీగా గడుపుతున్నారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సామాజిక, రాజకీయ, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు వివాహ వేడుకలకు హాజరవుతూ ప్రజలతో మమేకమవుతున్నారు. ఉదయం ప్రారంభమయ్యే పర్యటనలు రాత్రి వరకు కొనసాగుతుండటం ఆయన రోజువారీ కార్యక్రమాల తీరును తెలియజేస్తోంది. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం కార్తీక మాసం ఆరంభం నుంచి ఇప్పటివరకు సుమారు వందకు పైగా కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఒకవైపు పార్టీ కార్యక్రమాలు, మరోవైపు ప్రజల వ్యక్తిగత శుభకార్యాలకు హాజరవుతూ విభిన్న వర్గాల వారితో సంబంధాలను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం గోదావరిఖని, పెద్దపల్లి పట్టణాల్లో జరిగిన పలు వివాహ వేడుకలకు చందర్ హాజరయ్యారు. గోదావరిఖనిలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో డాక్టర్ కొండా రమేష్ కుమార్తె నవ్యశ్రీ, అక్షయ్ కుమార్‌ల వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. క్లాసిక్ గార్డెన్‌లో జరిగిన పిట్టల మహేష్, శశిప్రియ వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెద్దపల్లిలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో జరిగిన సాయి ప్రియ, నిఖిల్ రెడ్డి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకల్లో కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరిస్తూ వారి సంతోషాల్లో భాగస్వాములయ్యారు. రాజకీయ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజల కుటుంబ వేడుకలకు సైతం ప్రాధాన్యత ఇస్తుండటం ఆయన పర్యటనల్లో కనిపిస్తున్న అంశం. పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజలతో సంబంధాలు కొనసాగించడం రాజకీయ నాయకులకు కీలకమనే అభిప్రాయం ఉంది. ఆ కోణంలో చందర్ నిరంతర పర్యటనలు, వరుస కార్యక్రమాల్లో ఆయన భాగస్వామ్యం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తోంది. ప్రజల మధ్య ఉంటూ వారి ఆహ్వానాలకు స్పందించడం ద్వారా తన రాజకీయ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు.





చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

పోలియో రహిత సమాజం కోసం ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలి

చిన్నారుప్రజా వాయిస్ సంగారెడ్డి :
పిల్లల ఆరోగ్య పరిరక్షణకు, పోలియో వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు వచ్చి పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పట్టణంలోని ఇందిరానగర్ పీహెచ్‌సీ, పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలియో శిబిరాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలియో వ్యాధి నుంచి చిన్నారులను రక్షించేందుకు పల్స్ పోలియో కార్యక్రమం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, తల్లిదండ్రులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పోలియో నివారణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములై ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా సహకరించాలని అన్నారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం ద్వారా వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు భరోసా కల్పించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత, డీఎంఎంహెచ్ఓ డాక్టర్ లలిత దేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ జై రామ్ నాయక్, చిన్నారుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

చలమల శ్రీనివాసరావు కు ఘన నివాళి

స్మృతివనంలో నివాళి అర్పించిన జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్





జూలూరుపాడు, ప్రజావాయిస్:
అటవీ సంపద, మొక్కల పెంపకాన్ని పరిరక్షించే క్రమంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన దివంగత అటవీ అధికారి చలమల శ్రీనివాసరావు నాలుగో వర్ధంతి సందర్భంగా ఆదివారం చంద్రుగొండ అటవీ రేంజ్ పరిధిలోని స్మృతివనంలో అటవీ శాఖ జిల్లా అధికారి సిద్ధార్థ విక్రం సింగ్ ఘనంగా నివాళులర్పించారు. 2022 నవంబర్ 22న ఇదే ప్రాంతంలో అటవీ ప్లాంటేషన్‌ను పరిరక్షించే క్రమంలో శ్రీనివాసరావుపై దాడి జరిగి ఆయన ప్రాణాలు కోల్పోయారని జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ గుర్తు చేశారు. అటవీ పరిరక్షణ కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం, విధి పట్ల చూపిన అంకితభావం అటవీ శాఖ సిబ్బందికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. శ్రీనివాసరావు పనిచేసిన అటవీ ప్రాంతాల్లో నేటికీ అధికారులు, సిబ్బంది అదే బాధ్యతతో విధులు నిర్వహిస్తున్నారని, ఆయన పరిరక్షణకు కృషి చేసిన అటవీ ప్రాంతాలు, మొక్కలను కాపాడటం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. అటవీ ప్రాంతాలకు ముప్పు వాటిల్లినప్పుడు తక్షణమే స్పందించడం, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బందికి అండగా నిలవడం, అటవీ పరిసర గ్రామాల ప్రజలతో సమన్వయం చేసుకుంటూ అటవీ సంపదను సంరక్షించడం ద్వారా ఆయన త్యాగానికి నిజమైన నివాళి అర్పించగలమన్నారు. భవిష్యత్ తరాలకు పచ్చని అడవులను అందించడమే శ్రీనివాసరావుకు అందించే అత్యుత్తమ నివాళి అని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో స్మృతివనాన్ని సందర్శించే యువ అధికారులు, విద్యార్థులు పచ్చని అడవులను చూసి ఆయన చేసిన త్యాగాన్ని గుర్తుచేసుకునేలా అటవీ సంరక్షణకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అటవీ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



అంతర్జాతీయ వేదికపై పలిమెల క్రీడాకారిణి ప్రతిభ.. రజత పతకం కైవసం

- శ్రీలంకలో జరిగిన దక్షిణాసియా పారా త్రోబాల్
- ఛాంపియన్‌షిప్‌లో కావేరి జ్యోతి సత్తా..
- భారత జట్టుకు రన్నరప్ స్థానం

ప్రజా వాయిస్ పలిమెల
మారుమూల మండలం నుంచి అంతర్జాతీయ క్రీడా వేదిక వరకు సాగిన ప్రయాణంలో పలిమెలకు చెందిన క్రీడాకారిణి కావేరి జ్యోతి అరుదైన ఘనత సాధించారు. శ్రీలంకలో నిర్వహించిన రెండో దక్షిణాసియా పారా త్రోబాల్ ఛాంపియన్‌షిప్--2026లో భారత మహిళల జట్టుకు ప్రాతినిధ్యం వహించి రజత పతకం సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో దేశం తరఫున ఆడి పతకం సాధించడంతో పలిమెల మండలానికి గుర్తింపు తీసుకొచ్చారు. శ్రీలంకలోని రత్నపురలో నవంబర్ 19, 20 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో భారత్, నేపాల్, బంగ్లాదేశ్, ఆతిథ్య శ్రీలంక జట్లు పాల్గొన్నాయి. టోర్నీలో భారత మహిళల జట్టు నేపాల్, బంగ్లాదేశ్ జట్లపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. తుది పోరులో ఆతిథ్య శ్రీలంక జట్టుతో తలపడింది. హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో తొలి సెట్‌ను భారత్ 21–18తో గెలుచుకుని ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో సెట్‌లో శ్రీలంక 21–13తో విజయం సాధించి మ్యాచ్‌ను సమం చేసింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లో భారత జట్టు చివరి వరకు పోరాడినప్పటికీ 21–18తో శ్రీలంక విజయం సాధించింది. దీంతో భారత్ రజత పతకంతో రన్నరప్‌గా నిలవగా, నేపాల్ జట్టు కాంస్య పతకాన్ని దక్కించుకుంది. వరల్డ్ పారా త్రోబాల్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు, సెక్రటరీ జనరల్ డాక్టర్ వి. ఆల్బర్ట్ ప్రేమ్‌కుమార్ చేతుల మీదుగా భారత జట్టు రన్నరప్ ట్రోఫీని అందుకుంది. ఆదివారం శ్రీలంక ప్రావిన్స్ గవర్నర్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. భారత జట్టు ఈ స్థాయికి చేరుకోవడంలో కోచ్ సింగారపు బాబు కృషి కీలకమని క్రీడాకారులు పేర్కొంటూ ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు, పలిమెల వంటి మారుమూల ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని దేశానికి ప్రాతినిధ్యం వహించడమే కాకుండా పతకం సాధించడం పట్ల కావేరి జ్యోతిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆమె విజయాన్ని పలువురు అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.



అధ్యయన కేంద్రం ప్రారంభం

ఎస్డీఎఫ్ నిధులు రూ.4 లక్షలతో నిర్మాణం
ప్రారంభించిన జువ్వాడి నర్సింగ్ రావు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి
పోటీ పరీక్షల అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరం

ప్రజా వాయిస్, కోరుట్ల:
పట్టణంలోని సి. ప్రభాకర్ గ్రంథాలయం పక్కన ఎస్డీఎఫ్ నిధులు రూ.4 లక్షలతో నూతనంగా నిర్మించిన అధ్యయన కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర తొలి వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగ్ రావు మాట్లాడుతూ... గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని, విద్యార్థుల జీవితాల్లో ఇవి ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని అన్నారు. నిరుద్యోగ యువత, విద్యార్థుల అవసరాల దృష్ట్యా తనకు కేటాయించిన ఎస్డీఎఫ్ నిధుల నుంచి రూ.4 లక్షలు మంజూరు చేసి ఈ రీడింగ్ రూమ్ నిర్మించామని తెలిపారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పేద, మధ్యతరగతి అభ్యర్థులకు ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. యువతకు మెరుగైన విద్యా వాతావరణం, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.



ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ స్వేరో ఆత్మీయ సమ్మేళనానికి 20,000 రూపాయలు ఆర్థిక సహాయం

ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజా వాయిస్/రాయపర్తి

హన్మకొండ కాళోజి కళాక్షేత్రంలో.... ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న స్వేరో ఆత్మీయ సమ్మేళనానికి రాయపర్తి మండలం నుండి పోతున్న స్వేరో సైనికులకు ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్' తరపున 20. 000 రూపాయలు ఆర్థిక సహాయం చేసిన.....ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల నాయకులు లేతకుల రంగారెడ్డి ఐత రామచందర్ ముద్రబోయిన సుధాకర్ చందు రాము మైస వెంకటేశం స్వేరో నాయకులు వశపాక విజయ్ కుమార్ స్వేరో పాలకుర్తి నియోజకవర్గం కో కన్వీనర్ గారే నరేష్ స్వేరో మండల కన్వీనర్ ఐత జంపి ఐత మధు మండల అధ్యక్షులు పిరని రాము ఐత చందు ఐత శివ గౌరీ సతీష్ ఐత వీరన్న స్వేరో నాయకులు తదితరులు పాల్గొన్నారు...



తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరం మంథని మహిళా విభాగం నూతన కార్యవర్గం ఎన్నిక..

- ఉపాధ్యక్షురాలిగా బర్ల రజిత ఏకగ్రీవ ఎంపిక..
- మహిళా సాధికారతకు కృషి చేస్తానని వెల్లడి

ప్రజా వాయిస్ మంథని

తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరం మంథని మండల మహిళా విభాగం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షురాలిగా బర్ల రజిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బర్ల రజిత మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు మహిళా సాధికారత, మహిళా ప్రతినిధుల హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షురాలిగా కొత్త మౌనిక ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా బర్ల రజిత, మేకల లక్ష్మి, పబ్బల రమ, ఆకుల భాగ్యలక్ష్మి, వేముల సుమతి ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా కావాటి రజిత, శంకర్ల శశికళ, సంయుక్త కార్యదర్శులుగా నారమల్ల అఖిల, కావాటి స్వరూప, కొయ్యల పుష్ప బాధ్యతలు చేపట్టారు. నియోజకవర్గ, జిల్లా ఇన్‌చార్జుల సమక్షంలో నూతన కార్యవర్గ ఎంపిక ప్రక్రియ పూర్తయింది. నూతనంగా ఎన్నికైన బర్ల రజితతో పాటు కార్యవర్గ సభ్యులకు పలువురు నాయకులు, వార్డు సభ్యులు అభినందనలు తెలిపారు.



కలెక్టర్ కప్ క్యారమ్స్ పోటీల్లో వల్మిడి విద్యార్థిని ప్రతిభ.. ద్వితీయ బహుమతి కైవసం!

మాచర్ల సాత్వికకు రూ.6 వేల నగదు బహుమతి, మెమొంటో అందజేత..

ప్రజా వాయిస్ / పాలకుర్తి/నవంబర్ 22

జనగామ జిల్లా కేంద్రంలో ఈరోజు నిర్వహించిన కలెక్టర్ కప్ జిల్లా స్థాయి అండర్-14 క్యారమ్స్ పోటీల్లో వల్మిడి ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని మాచర్ల సాత్విక ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతిని సాధించింది.ఈ పోటీల్లో సాత్వికకు అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వాన్ని శ్రీ పి. మురళి, శ్రీ యం. రవీందర్ అందించారు. వారి ప్రోత్సాహం, మార్గదర్శకత్వంతో పోటీల్లో పాల్గొని సాత్విక ఈ విజయాన్ని సొంతం చేసుకుంది.ఈ సందర్భంగా జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చేతుల మీదుగా విద్యార్థినికి రూ.6,000 నగదు బహుమతితో పాటు మెమొంటో అందజేశారు.విద్యార్థిని సాధించిన విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ సాత్వికను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

వేషం వెనుక వెతలు.. రంగస్థలంపై కళా వైభవం..!

- ఆదరణ కరువై అస్తిత్వ పోరాటం చేస్తున్న చిందు యక్షగాన కళాకారులు
- కళా రత్న అవార్డు గ్రహీత కిష్టమయ్య మృతి పట్ల పలువురు సంతాపం

ప్రజా వాయిస్ /దుబ్బాక :

తెలంగాణ పల్లెల్లో ఒకప్పుడు రాత్రంతా సాగిన జానపద కళా ప్రదర్శనలు ప్రజలను మంత్రముగ్ధులను చేసేవి. రంగురంగుల వస్త్రధారణ, ముఖానికి ప్రత్యేకమైన రంగులు, ఆభరణాలు, గజ్జెల సవ్వడులు, పాటలు, పద్యాలు, నృత్యాలు, అద్భుతమైన అభినయంతో ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లే కళారూపం చిందు యక్షగానం. తరతరాలుగా వారసత్వంగా వస్తున్న ఈ కళను నమ్ముకొని జీవనం సాగిస్తున్న కళాకారులు నేడు ఆదరణ లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు అందులో ప్రభుత్వ పరంగా గుర్తింపు చెందిన చిందు యక్షగాన సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం అక్బర్ పేట- భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామానికి చెందిన పిల్లిట్ల కృష్ణయ్య కళా రత్న అవార్డును పొందారు ప్రతి పల్లెలో ఆయన యక్షగాన కలకు ప్రజలు మంత్రముగ్ధులయ్యేవారు ఎక్కడికక్కడ ప్రజలను తన ఆటపాటలతో మైమరిపించి సామాజిక అంశాలను వరకట్నం నిషేధం మూఢనమ్మకాలు సామాజిక అంశాలు ఇలా తదితర అంశాలపై తన దీన శైలిలో యక్షగానంలో ప్రదర్శనలు ఇచ్చి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన కిష్టమయ్యకు ప్రభుత్వం గుర్తించి అప్పటి రాష్ట్ర మంత్రి తన్నీరు హరీష్ రావు ఆ సమయంలో ఉన్న కలెక్టర్ రోనాల్డ్ రోస్ చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభ కళా రత్న ప్రశంస పత్రాన్ని అందుకున్నారు నిరుపేద కళాకారుడైన యక్షగానం పట్ల పట్టు విడవని విక్రమార్కుడిలా కలపై కలకున్న ప్రాముఖ్యతను తన కుటుంబీకులకు ప్రజలకు ఎప్పుడు చెబుతుండేవాడని కానీ తన కళ్ళతో తన గళంతో ఎప్పుడు ప్రజలను నవ్విస్తూ ప్రజలతో మమేకమై ఉండే కళాకారుడు అనారోగ్యం కారణం చేత కనుమరుగవడంతో ఆ గ్రామంలో విషాదఛాయల్ అలుముకున్నాయి యక్షగానం మూగబోయి కనిపించడం తో తాను తిరిగిన ప్రతి పల్లె ప్రజల్లో బాదం మిగిల్చి తన కుటుంబాన్ని అయోమయంలోకి తీసుకువెళ్లిందని చెప్పవచ్చు

ప్రభుత్వపరంగా ఆదుకోవాలి

చిందు యక్షగాన కలారత్న అవార్డు గ్రహీత పిల్లిట్ల.కృష్ణయ్య మృతి ఆ కుటుంబానికి తీరని లోటు ప్రభుత్వం యక్షగాన కళాకారులు కుటుంబాలను ఆదుకోవాలని కిష్టమయ్య కుటుంబానికి అండగా ప్రభుత్వం నిలవాలని బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ ఫోరం సంస్థ విభాగం జిల్లా అధ్యక్షుడు పిన్నింటి దాస్ కోరారు



చిందు యక్షగాన కళాకారుడి మృతి పట్ల సంతాపం

కళా రత్న అవార్డు గ్రహీత పిల్లిట్ల కృష్ణయ్య మృతి బాధాకరమని ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని చిందు యక్షగాన కళాకారుల కుటుంబాలకు ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించి సొంత ఇండ్ల నిర్మాణం చేసి వారికి సమస్యని కల్పించాలని అదేవిధంగా ఆర్థిక భరోసా ,ఉపాధి,ఆరోగ్య భద్రత, కల్పించి కలను కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు. అడుగులోనే ప్రత్యేకత.. అభినయంలో అద్భుతం చిందు యక్షగానం తెలంగాణ జానపద సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. 'చిందు' అంటే గెంతు లేదా దూకుడు అని అర్థం. కళాకారులు ప్రదర్శనలో వేసే ప్రత్యేకమైన అడుగులు, గెంతులు ఈ కళకు ప్రత్యేక గుర్తింపును తెచ్చాయి. పాట, పద్యం, సంగీతం, నృత్యం, సంభాషణ, వేషధారణ, అభినయం అన్నీ కలగలిపిన సమగ్ర రంగస్థల కళ ఇది. రామాయణం, మహాభారతం, భాగవతం, జాంబవ పురాణం వంటి ఇతిహాస, పురాణ గాథలను కళాకారులు తమదైన శైలిలో ప్రజలకు అందిస్తారు. సత్యహరిశ్చంద్రుడు, శ్రీకృష్ణుడు, అర్జునుడు, రావణుడు, కీచకుడు వంటి పాత్రలను అద్భుతంగా అభినయిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటారు. ఎల్లమ్మ చరిత్ర, లవకుశ వంటి కథలు కూడా ఈ ప్రదర్శనల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

వారసత్వంగా వచ్చిన కళ.. జీవితంగా మలుచుకున్న వృత్తి

చిందు యక్షగానం కళాకారులు తమ కుటుంబాల్లో పెద్దల నుంచి ఈ కళను నేర్చుకుంటారు. చిన్నతనం నుంచే తల్లిదండ్రులతో కలిసి ప్రదర్శనలకు వెళ్లి పాటలు, పద్యాలు, సంభాషణలు, వేషధారణ, రంగస్థల మెళకువలు అభ్యసిస్తారు. ఒక ప్రదర్శనలో పలువురు కళాకారులు కలిసి వివిధ పాత్రలను పోషిస్తారు. మహిళా, పురుష కళాకారులు కూడా ఇందులో భాగస్వాములవుతారు.తమకు అందుబాటులో ఉన్న వనరులతోనే వస్త్రాలు, ఆభరణాలు, వేదిక సామగ్రిని సిద్ధం చేసుకుంటారు. ఒక పాత్ర కోసం రోజుల తరబడి సాధన చేస్తారు. రంగస్థలంపై రాజులుగా, దేవతలుగా, వీరులుగా కనిపించే వీరు.. ప్రదర్శన ముగిసిన తర్వాత మాత్రం సాధారణ జీవితం కోసం ఎన్నో కష్టాలు పడుతున్నారు.

ఆదరణ తగ్గి.. ఉపాధి కరువై

గతంలో గ్రామాల్లో జాతరలు, ఉత్సవాలు, ప్రత్యేక సందర్భాల్లో చిందు యక్షగాన ప్రదర్శనలకు విశేష ఆదరణ ఉండేది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా వచ్చి రాత్రంతా ప్రదర్శనలను వీక్షించేవారు. ప్రస్తుతం టెలివిజన్, సినిమా, డిజిటల్ వినోద మాధ్యమాల ప్రభావం, గ్రామీణ కళా ప్రదర్శనలకు అవకాశాలు తగ్గడం వంటి పరిణామాలు కళాకారుల ఉపాధిపై ప్రభావం చూపుతున్నాయి.ప్రదర్శనలకు తగిన పారితోషికం లభించకపోవడం, నిరంతర అవకాశాలు లేకపోవడం, కుటుంబ పోషణ భారంగా మారడం వంటి సమస్యలు కళాకారులను వేధిస్తున్నాయి. యువతలో కొందరు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో వారసత్వంగా వస్తున్న కళను తదుపరి తరాలకు అందించే విషయంలోనూ సవాళ్లు ఎదురవుతున్నాయి.

గుర్తింపు రావాలి.. ప్రోత్సాహం అందాలి..

చిందు యక్షగానం కేవలం వినోదం మాత్రమే కాదు. అది తెలంగాణ ప్రజల జీవన విధానం, భాష, సంస్కృతి, చరిత్ర, సామాజిక అనుభవాలను ప్రతిబింబించే కళారూపం. ఈ కళను కాపాడుకోవాలంటే కళాకారులకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.ప్రభుత్వం కళాకారులకు క్రమం తప్పకుండా ప్రదర్శన అవకాశాలు కల్పించాలని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సాంస్కృతిక కార్యక్రమాల్లో చిందు యక్షగానానికి ప్రాధాన్యం ఇవ్వాలి. కళాకారులకు తగిన పారితోషికం, గుర్తింపు, శిక్షణ సదుపాయాలు కల్పించాలి. అర్హులైన కళాకారులకు పెన్షన్లు, సంక్షేమ పథకాలు అందేలా చూడాలి. యువతకు ఈ కళపై ఆసక్తి కలిగించేలా ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహించాలి.

కళాకారులను ఆదరిస్తేనే కళకు మనుగడ

రంగస్థలంపై పాత్రలో జీవిస్తూ ప్రేక్షకులకు ఆనందాన్ని పంచే చిందు యక్షగాన కళాకారుల జీవితాల్లోనూ వెలుగులు నింపాల్సిన బాధ్యత సమాజంపై ఉంది. కళాకారులను కేవలం జాతరలు, ఉత్సవాలకే పరిమితం చేయకుండా వారి ప్రతిభకు తగిన గౌరవం కల్పించాలి. కళను కాపాడటం అంటే కళాకారుల జీవితాలను కాపాడటమే.తరతరాలుగా వస్తున్న చిందు యక్షగాన సంప్రదాయం కనుమరుగుకాకుండా ఉండాలంటే ప్రభుత్వ ప్రోత్సాహం, ప్రజల ఆదరణ, యువత భాగస్వామ్యం అవసరం. వేషం వెనుక ఉన్న కళాకారుడి కష్టాన్ని గుర్తించి చేయూత అందించినప్పుడే తెలంగాణ జానపద కళావైభవం భవిష్యత్ తరాలకు సజీవంగా అందుతుంది.



27 ఏళ్ల తర్వాత ఆత్మీయ కలయిక..

- నవాబుపేట ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సందడి!
- గురువులకు ఘన సన్మానం.. చిన్ననాటి జ్ఞాపకాలతో ఆనందోత్సాహాలు

ప్రజావాయిస్/నవాబుపేట:

వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1997-98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నవాబుపేటలోని సాయి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు.దాదాపు 27 ఏళ్ల తర్వాత విద్యార్థినీ విద్యార్థులంతా ఒకేచోట చేరి చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాత స్నేహాలను గుర్తుచేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని సందడి చేశారు.ఈ సందర్భంగా హాజరైన అప్పటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. తమ జీవితాలకు విద్యాబుద్ధులు నేర్పి, భవిష్యత్తుకు బాటలు వేసిన గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని చాటుకున్నారు. గురువుల ఆశీస్సులు అందుకుంటూ, స్నేహబంధాలను మరోసారి గుర్తుచేసుకుంటూ ఈ సమ్మేళనాన్ని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.



రెండు ఎమ్మెల్సీల స్థానాల్లోనూ బీజేపీ విజయం సాధించాలి

పార్టీ శ్రేణులకు రాంచందర్‌రావు పిలుపు

హైదరాబాద్, నవంబరు 22

దేశ ఆర్థిక ప్రగతిపై వాస్తవాలను, గణాంకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రపంచంలోని అగ్రదేశాలతో పోలిస్తే భారత్ వేగంగా ఆర్థిక వృద్ధి సాధిస్తోందని, 7.1శాతం వృద్ధి రేటుతో ముందంజలో ఉందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికల సన్నద్ధతపై ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.



ఆదివాసీ హక్కుల జోలికొస్తే సహించం : టీఏజీఎస్

భద్రాచలం, ప్రజా వాయిస్:

ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల హక్కుల జోలికొస్తే ఊరుకోబోమని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) భద్రాద్రి జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య హెచ్చరించారు. ఆదివారం భద్రాచలం పట్టణంలో జరిగిన సంఘం 4వ టౌన్ మహాసభలో ఆయన మాట్లాడారు. 1/70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చే అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నంబరు 3ను పునరుద్ధరించి, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. తెల్లం శరత్‌బాబు కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదు సెంట్ల ఇంటి స్థలంతో పాటు అర్హులైన గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఈ సభలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు సున్నం గంగ, టౌన్ కార్యదర్శి కుంజా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



ఆపన్నులకు అండగా సీఎం సహాయ నిధి

227 కుటుంబాలకు రూ.82.36 లక్షల ఆర్థిక భరోసా

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

ప్రజా వాయిస్,కోదాడ:

ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 227 మంది లబ్ధిదారులకు రూ.82,36,000 విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలు, ఇతర అత్యవసర పరిస్థితులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. 227 మందికి ఒకేసారి రూ.82.36 లక్షల సాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ బాబు, కౌన్సిలర్ల ఫోరం అధ్యక్షుడు కందుల కోటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు శరభేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, రఘుపతి, సూర్యం తదితర నాయకులు పాల్గొన్నారు.